జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :234 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

**WANTED**



గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967

## మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా
# 'ఏపీ మోడల్'

- 2029లోగా మరో 3 డీఎస్సీలు: మంత్రి లోకేశ్
- పిల్లల జీవితాలను మార్చే శక్తి టీచర్లకే ఉంది
- వారి మానసిక ఎదుగుదలపై దృష్టి సారించాలి
- ప్రవర్తనలో మార్పులను జాగ్రత్తగా గమనించాలి
- ప్రభుత్వ బడులకు హౌస్‌ఫుల్, నో అడ్మిషన్ బోర్డులు ఉండాలి



**అమరావతి**

డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి నారా లోకేశ్? పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడారు. 2029లోగా మరో 3 డీఎస్సీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఏపీ మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని లోకేశ్ చెప్పారు. 'కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి. 14 డీఎస్సీలు వేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు.

- మిగతా3లో



## డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- 'మొబైల్ వినియోగానికి క్రీడలే పరిష్కారం'
- 'విద్యార్థుల్లో డ్రగ్స్, స్క్రీన్ టైం విషయంలో అప్రమత్తంగా ఉండాలి'
- ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచన
- విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచన
- పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లించాలని పిలుపు

## పే-రివిజన్ కమిషన్ నియామకానికీ
# గ్రీన్ సిగ్నల్

- 2 పెండింగ్ డీఏలను విడుదలకు ఓకే..
- ఈహెచ్ఎస్ స్ట్రీమ్ లైన్... 2022 ఏడాది సరెండర్ లీవుల విడుదల
- ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి**

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే--రివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయ--వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1--7--2024, 1--1--2025లకు చెందిన రెండు

- మిగతా3లో



## ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కీలక మార్పులు


- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- పలు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యులుగా పీవీ మోహన్ నియామకం
- ఆదేశాలు జారీ చేసిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



## అసెంబ్లీ ఎన్నికల వేళ 4 రాష్ట్రాల్లో జనగణన

- ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!
- ఉత్తరాఖండ్, గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లో జనగణన షెడ్యూల్ రిలీజ్
- 2026 డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు నిర్వహణ
- వచ్చే ఏడాదే 4 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

## పెండింగ్ కేసుల పరిష్కారంపై
# ప్రత్యేక దృష్టి



- ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో వేగంగా విచారణ
- ఎస్సీ, ఎస్టీ హైపవర్ కమిటీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా కోర్టుల్లో పరిష్కరించేలా చూడాలి
- ప్రత్యేక సెషన్ కోర్టులు, స్పెషల్ కోర్టుల్లో కేసులను రేషనలైజ్ చేసి పరిష్కరించాలి
- చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పు చేసిన వారికి శిక్షపడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం

**అమరావతి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి విచారణ వేగంగా జరిపి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా కోర్టుల్లో పరిష్కరించేలా చూడాలని, ప్రత్యేక సెషన్ కోర్టులు, స్పెషల్ కోర్టుల్లో కేసులను రేషనలైజ్ చేసి పరిష్కరించాలని సీఎం సూచించారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పు చేసిన వారికి శిక్షపడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమంపై రాష్ట్రస్థాయి అత్యున్నత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వైద్యారోగ్యం తదితర అంశాలపై సీఎం కీలక సూచనలు చేశారు. గుంటూరు, అనంతపురం,

- మిగతా3లో



## ఏపీలో జిల్లా పరిషత్‌ల
# పునర్వ్యవస్థీకరణ

- ఇక 28 జడ్పీలు - ఉత్తర్వులు జారీ
- కొత్త జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ
- ప్రస్తుతం ఉన్న 13 జడ్పీల స్థానంలో 28 కొత్త జడ్పీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు మార్కాపురం, పోలవరం జిల్లాలకు సైతం జడ్పీల మంజూరు
- కొత్త జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణ

**అమరావతి**

రాష్ట్రంలో పాలనా వికేంద్రీకరణలో భాగంగా పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం జిల్లా ప్రజా పరిషత్‌లను పునర్వ్యవస్థీకరించింది. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీల స్థానంలో, కొత్తగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. 2025 నవంబర్‌లో

- మిగతా3లో



## మీడియా రంగం విశ్వసనీయత కోల్పోతోంది

- నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్యానికి మీడియా, న్యాయవ్యవస్థ కీలకం
- మీడియా రంగంలో విశ్వసనీయత సంక్షోభం సమస్య మరింత తీవ్రమైంది
- ప్రజాస్వామ్య పురోగతికి స్వతంత్ర మీడియా ఎంతో ముఖ్యం
- ప్రజలు, సమాజం కోసం పనిచేస్తే క్రెడిబిలిటీ తిరిగి సాధించొచ్చని సూచనలు

## ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



**ప్రజాజ్యోతి న్యూస్ ప్యాపి** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్యాపిలి నందు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గారి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం ను నిర్వహించడం జరిగింది. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సుబ్రమణ్యం గారు మాట్లాడుతూ ఈ రోజు (సెప్టెంబర్ 5), ఉపాధ్యాయ దినోత్సవం. భారతరత్న, మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి సందర్భంగా మనమందరం ఇక్కడ సమావేశమయ్యాము. విద్యార్థులారా, గురువు అంటే కేవలం పాఠం చెప్పే వ్యక్తి కాదు. మీ జీవితానికి దారి చూపే దీపం. తల్లిదండ్రులు మీకు జన్మనిస్తే, గురువు మీకు జీవితాన్ని ఇస్తాడు. మంచి చెడులను, గెలవడం, ఓడినప్పుడు మళ్ళీ లేవడం నేర్పేది గురువే.ఈ రోజుల్లో టెక్నాలజీ పెరిగింది. గూగుల్ లో అన్ని సమాధానాలు దొరుకుతాయి. కానీ జీవితంలో ఎలా నడుచుకోవాలి, మంచి మనిషిగా ఎలా ఎదగాలి అనేది గూగుల్ చెప్పదు. అది కేవలం ఒక ఉపాధ్యాయుడు మాత్రమే చెప్పగలడు. మా ఉపాధ్యాయులందరికీ నా విజ్ఞప్తి. మీరు చేస్తున్నది ఉద్యోగం కాదు, అది ఒక యజ్ఞం. మీరు తీర్చిదిద్దే ప్రతి విద్యార్థి ఈ దేశ భవిష్యత్తు. మీ ఒక్క మాట ఒక విద్యార్థి జీవితాన్ని మార్చగలదు.ప్రియమైన విద్యార్థులారా, ఈ రోజు ఒక్క రోజు మాత్రమే గురువులను గౌరవిస్తే సరిపోదు. ప్రతి రోజూ వారి మాట వినండి, వారిని గౌరవించండి. అదే మీరు వారికి ఇచ్చే నిజమైన గురుదక్షిణ. కళాశాలలో ప్రతి సంవత్సరం ఒకరిని సన్మానిచడం ఒక ఆనవాయితీ అందులో భాగంగా ఈ సంవత్సరం వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు వెంకటరమణ ను సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గారు నవీన పాటి అధ్యాపకులు ముస్తాక్,శంకరయ్య, మద్దిలేటి వెంకటరమణ వెంకటేశ్వర్లు, మురళి మోహన్ గౌడ్, ఓబులేసు, వన్నూర్ మరియు చీూ వాలంటీర్స్

## ఘనంగా జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం..

సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అంగన్వాడి టీచర్ చంద్రకళ ........



**చాగలమర్రి , సెప్టెంబర్ 5 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల కేంద్రమైన చాగలమర్రిలోని 17వ అంగన్వాడి కేంద్రంలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అంగన్వాడి టీచర్ చంద్రకళ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించిన రాధాకృష్ణన్ సేవలు మరువలేను అని ఆమె అన్నారు. జ్ఞానం అనే దివ్య ను వెలిగించి, అజ్ఞానం అనే చీకట్లను పారద్రోలే అక్షరమూర్తులు ఉపాధ్యాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల తల్లులు పలువురు పాల్గొన్నారు.

## మాధురి స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**శంఖవరం, సెప్టెంబర్ 5:(ప్రజాజ్యోతి న్యూస్)** సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించు కుని కత్తిపూడి మాధురి విద్యాలయంలో గురుపూజోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మాధురి విద్యాసంస్థల చైర్మన్ కడారి తమ్మినాయుడు, డైరెక్టర్ కడారి సీతాదేవి, సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం చైర్మన్ తమ్మినాయుడు మాట్లాడుతూ - విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో గొప్పదన్నారు. గురువు పట్ల గౌరవం, క్రమశిక్షణ ప్రతి విద్యార్థి కలిగి ఉండాలని సూచించారు. గురువు చూపిన మార్గంలో నడిస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందిని ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాధురి విద్యాలయ ప్రిన్సిపాల్ అచ్యుత రామనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్దిలేటి క్షేత్రంలో గుర్తుతెలియని మృతదేహం



**బేతంచెర్ల:సెప్టెంబర్ 5(ఆంధ్రపత్రిక)** బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని ప్రముఖ పుణ్యక్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయ పరిసరాల్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆలయ ప్రాంగణంలో దుర్వాసన రావడంతో సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న బేతంచెర్ల ఎస్ఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, తెల్లటి చొక్కా, గళ్ల పంచె ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి వారం రోజుల క్రితం స్వామివారి దర్శనం కోసం ఆలయానికి వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ, పూర్తి వివరాల కోసం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

నందవరంలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



**నందవరం, సెప్టెంబర్ 05 (ప్రజా జ్యోతి):** నందవరంలోని ఎంపీపీ ఎస్ స్పెషల్ పాఠశాలలో హెచ్ఎం ఎండీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి దాసరి గోవింద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించారు. 14 మంది ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, నైతికత, సామాజిక బాధ్యతలను నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవుళ్ల భీమశేఖర్, సప్లయర్ వీరేష్, గవ్వల నారాయణ, రాజోలి గజేంద్రనాయుడు, ఉపాధ్యాయులు దేవపాల్, నరసన్న, మహబూబ్ బాషా, నాగరాజు, ప్రశాంత్, సుబ్బయ్య, గౌతమి, విజయశాంతి, విద్యాలక్ష్మి, పద్మావతి, ప్రమీలరాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..

ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ఆకట్టుకున్న ఊరేగింపులు..

-- ముగతిలో చిన్నారుల కోలాటాలు, వేషధారణలు ప్రత్యేక ఆకర్షణ.



**నందవరం, సెప్టెంబరు 5 (ప్రజా జ్యోతి):** నందవరం మండలంలోని ఆయా గ్రామాల్లో ముగతిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం, అనంతరం శ్రీకృష్ణుడి చిత్రపటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల కోలాటాలు, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోమశేఖర్ రెడ్డి, విరుపాక్షి రెడ్డి, భార్గవ్ యాదవ్, సాయిబాబా రెడ్డి, కె ఆర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ప్యాపి



**ప్రజాజ్యోతి న్యూస్ ప్యాపి** జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29) సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో, ప్యాపిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 2026 లభించింది.శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐజూా గారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఖ. సరళాదేవి గారిని మరియు ఫిజికల్ డైరెక్టర్లు శ్రీమతి విజయలక్ష్మి గారు, శ్రీమతి శ్రీకళ గారిని ఘనంగా సన్మానించి, అవార్డు మరియు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను, గారిని, గార్లను మరియు పాఠశాల సిబ్బందిని డిప్యూటీ ఐజూా గారు అభినందించారు. ఈ విజయంపై పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## అంబాపురం శ్రీ అభయాంజనేయ స్వామికి విశేష పూజలు........



**చాగలమర్రి , సెప్టెంబర్ 05( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం అంబాపురం గ్రామంలో ( మూడురాళ్ళపల్లె గ్రామం వెళ్ళే దారిలో ) శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ప్రతి శనివారం వైభవంగా పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు శంకరాచారి తెలిపారు. పూజారి కైప వెంకట నరసింహ శాస్త్రి ఆధ్వర్యములో గణపతి పూజ నిర్వహించారు. ప్రతి శనివారం దాదాపుగా 1000 మందికి పైగా రాత్రి అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భజన బృందంతో ప్రతి శనివారం భజన కార్యక్రమం చేస్తున్నారు. ఉభయదారులు మూడే శంకర్ నాయక్ ధర్మపత్ని పార్వతి భాయ్ , శ్రవణ్ నాయక్ , విశ్వనాథ్ నాయక్ , మనోజ్ నాయక్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.ఆలయ సభ్యులు పూజ అనంతరం ఉభయదారులకు శాలువ కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చారపల్లి గ్రామ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్



**హాలహర్వి మండలం సెప్టెంబర్ 05 , ప్రజా జ్యోతి :-** హాలహర్వి మండల పరిధిలోని పచ్చారపల్లి గ్రామ పాఠశాల నందు శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ వన్నూర్ స్వామి మరియు పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శంకర్, ఉమామహేశ్వర్ జయంతి, మహేశ్వరి ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా పచ్చారపల్లి జనార్ధన మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జరుపుకునే ఈ రోజున ఉపాధ్యాయుల సేవలను కొనియాడటం మనందరి బాధ్యత అని, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులే అని అన్నారు.అనంతరం ఉపాధ్యాయులు శంకర్, ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తమను ఇంత ఘనంగా సన్మానించిన పాఠశాల చైర్మన్ వన్నూర్ స్వామి గారికి మరియు భగత్ సింగ్ యూత్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాము ఎల్లప్పుడూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండు, రమేష్, ఈరన్న, నవరాజు, శివ, మధు, భీమేష్ తదితర యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు అభివృద్ధికి మరో ముందడుగు!

రూ.303.38 లక్షలతో పలు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బీవీ.

-- రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, పైప్‌లైన్లకు శ్రీకారం

-- 24 గంటల తాగునీటి సరఫరానే లక్ష్యం



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 05(ప్రజా జ్యోతి ):** పట్టణంలోని పలు వార్డుల్లో రూ.303.38 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీలు, హెచ్ డి ఈ పి పైప్‌లైన్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి భూమిపూజ చేశారు.మిలిటరీ కాలనీ, ఎమ్మెస్ నగర్, ఎల్లమ్మ బీడు, సంజీవయ్య నగర్, హనుమాన్ నగర్, గాంధీనగర్, మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టనున్నారు.భూమిపూజ చేసిన పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తయిన అనంతరం ఎమ్మిగనూరు ప్రజలకు 24 గంటల తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మిగనూరును మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎల్లార్తి దర్గాల ఉరుసు ఉత్సవాల పోస్టర్లు విడుదల

ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా పోస్టర్ విడుదల చేసిన నిర్వాహకులు, గ్రామస్తులు



**హోళగుంద,ఆలూరు, సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి న్యూస్ -** రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో వెలిసిన షేక్షావలి శాశావలి దర్గాల 364 వ ఉరుసు మహోత్సవాల వాల్ పోస్టర్లను దర్గా నిర్వాహకులు, గ్రామస్తులు ఆలూరు టిడిపి ఇన్చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 8న గంధం కార్యక్రమంతో మొదలయ్యే ఉరుసు మహోత్సవాలు , 9న పురుసు మహోత్సవాలు,10 వ తేదీన జీహార కార్యక్రమాలతో ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, పార్కింగ్ సదుపాయం, విధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక తేదేపనాయకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మల్లికార్జున, ఎల్లార్తి గ్రామస్తులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గృహ లబ్ధిదారుల పరిస్థితి అయోమయం




**బద్వేల్ అర్బన్ గోపవరం: సెప్టెంబర్ 5 ప్రజా జ్యోతి న్యూస్.,...** బద్వేలు గోపవరం మండలాల రెవిన్యూ అధికారుల ధన దాహార్తితో మరియు హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉన్న డబ్బుతో బేస్మెంట్లు నిర్మించుకొని బిల్లులు మంజూరు కాక దిక్కుతోచని స్థితిలో ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులు ఉన్నారని దీనికంతటికి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం మరియు రెవెన్యూ హౌసింగ్ అధికారుల ధన దాహార్తి కారణమని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ తీవ్రంగా మండిపడ్డారు. శనివారం ఉదయం స్థానిక బద్వేల్ పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో గల వారి పార్టీ కార్యాలయం నందు పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.శీ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద బద్వేల్ మున్సిపాలిటీలోని బద్వేలు గోపవరం మండలాల పరిధిలో సుమారు వెయ్యి మందికి పైబడి పేద బడుగు బలహీన వర్గాలకు ఎన్టీఆర్ గృహాలు మంజూరయ్యాయని వారు తెలిపారు. తమ సొంత ఇంటి కల నెరవేరబోతున్నదన్న సంతోషంలో మన కష్టార్జితంలో కూడబెట్టుకున్న డబ్బు మరికొంతమంది అప్పులు చేసి మరి తెచ్చి బేస్మెంట్లు నిర్మించుకొని ఆశగా హౌసింగ్ అధికారుల దగ్గరకు బిల్లుల కోసం వెళ్లగా రెవిన్యూ వద్దనుండి అనుబంధ పత్రాలు తీసుకురండి అని చెప్పడంతో లబ్ధిదారులు రెవెన్యూ అధికారుల దగ్గరికి వెళ్ళగా ఇదే అవకాశం గా తీసుకున్న రెవెన్యూ అధికారులు ప్రతి అనుబంధ పత్రానికి పదివేల నుండి 30 వేల వరకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఏం చేయాలో తెలియని దిక్కున తోచని స్థితిలో లబ్ధిదారులు ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇస్తేనే అనుబంధ పత్రం అంటూ రెవెన్యూ అధికారులు, అనుబంధ పత్రం ఇస్తేనే బిల్లులు మంజూరు అంటూ హౌసింగ్ అధికారులు లబ్ధిదారులను తిప్పుకుంటున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. దీనికంతటికి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం మరియు రెవెన్యూ హౌసింగ్ అధికారుల ధన దాహార్తి కారణమని ఆయన ఆరోపించారు. ఇప్పటికే ఉన్న సొమ్ముతో బేస్మెంటు నిర్మించుకొని తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అల్లాడుతున్న ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులను తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అనుబంధ పత్రాలు ఇప్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులతో కలిసి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ హౌసింగ్ కార్యాలయాల వద్ద ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి చంద్రమోహన్ రాజు జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, సంజీవ రాయుడు, విజయరావు, జయరామరాజు, నారాయణ, చంద్రపాల్, పోతురాజు రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణ వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

**పద్మిని, ఉదయ భాస్కర్ ఆక్స్ ఫర్డ్ స్కూల్లో అత్యంత ఘనంగా టీచర్స్ డే వేడకలు**
**ఉపాధ్యాయులకు విద్యార్థులు ఘన సత్కారాలు అలరించిన విద్యార్థుల గీతాలాపన నృత్యాలు, వకృత్వం**
**ఉత్తమ ఉపాధ్యాయుడిగా గణితం మాస్టారు అంజిబాబుకు జ్ఞాపిక, ధ్రువ పత్రం అందజేత**



**ప్రజాజ్యోతి (పోదూరు), – సెప్టెంబర్ –05 :** సర్వేపల్లి రాధాకృష్ణన్ వ్యక్తిత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని పోదూరు ఆక్స్ ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మోదిన ఉదయ భాస్కరరావు పద్మిని పేర్కొన్నారు. పోదూరు ఆక్స్ ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం(టీచర్స్ డే) పురస్కరించుకుని శనివారం స్కూల్లో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్కూలు లోని ఉపాధ్యాయులకు సాలువాలను కప్పి, పూలు, పూలమాలవేసి నమస్కరించి ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు, టీచర్స్ డే, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సంబంధించి వతృత్వం నిర్వహించారు. గణితం అంజిబాబు మాస్టారుకు ఆక్స్ ఫర్డ్ స్కూల్ ఆధ్వర్యంలో జ్ఞాపికను అందజేసి సాలువా కప్పి పూలమాలతో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ ఉదయ భాస్కర రావు పద్మినీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాజీ రాష్ట్రపతిగా, ఉపరాష్ట్రపతిగా, ఉపాధ్యాయుడిగా, ప్రొఫెసర్ గా, ఛాన్స్ లర్ గా పని చేశారన్నారు. ఆ పదవులకు వన్నె తెచ్చారని ప్రశంసించారు. ఆయన బాటలో ప్రతి విద్యార్థి నడవాలని ఆకాంక్షించారు. ఆయనే జీవిత చరిత్ర అందరికీ స్ఫూర్తిదాయకం పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హితవు పలికారు. దశ దిశల వ్యాపించిన ఆయన కీర్తి ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, పెద్దింట్లు, సౌజన్య, భవాని, కవిత, మంజూష, సుష్మ, శాంతి, ధానేశ్వరి సఖిల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘోరమైన ఘటనా మహిళ కిడ్నాప్

**కాకులారం వెళ్లే మార్గంలో వాయల్ రాజు గారి పల్లె అడవుల్లోకి తీసుకెళ్లిన భర్త రామరాజు**
**భర్త రామరాజు మరియు అతని అనుచరులు గజపతిరాజు,దూళ్ళ శ్రీనివాసులు మరొక ఇద్దరు కలిసి వాయల్ రాజు గారి పల్లి అడవుల్లో మహిళపై దాడి**
**మహిళపై దాడి చేసి హత్య చేయాలనుకున్న భర్త రామరాజు మరియు అతని అనుచరులు గజపతిరాజు మరియు దూళ్ళ శ్రీనివాసులు మరికొందరు**
**తన భర్తతో ప్రాణహాని ఉందని గత పది రోజుల క్రితం జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేసిన మహిళ**
**మహిళ ఫిర్యాదు పై ఇప్పటివరకు స్పందించని జిల్లా పోలీసు వ్యవస్థ**

**రాయచోటి సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఆమెను కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన భర్త రామరాజుఅతని అనుచరులుభార్య లలితను చిత్రహింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టిన భర్త రామరాజుభర్త రామరాజు తో విడాకులు తీసుకుని భర్త భయంతో కలకడలో తలదాచుకుని ఒంటరిగా జీవిస్తున్న మహిళ లలిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు పై నిర్లక్ష్యం వహించిన జిల్లా పోలీస్ యంత్రాంగం శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ లలితను తన భర్త గత పది రోజుల క్రితం ఫిర్యాదులో పేర్కొన్న అతని అనుచరులు కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లిన పరిస్థితి,రెండు వాహనాల్లో వచ్చి ఆమెపై దాడి చేసి అడ్డు వచ్చిన గ్రామస్తుల పైన కూడా దాడి చేసి ఆమెను తీసుకెళ్లిన భర్త రామరాజు,కలకడ నుండి కిడ్నాప్ చేసి తీసుకెళ్లి కాకులారం వద్ద వైల్ రాజు గారి పల్లె అడవుల్లోకి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి అనంతరం ఆమె తండ్రి ఇంట్లో బంధించి తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసిన పరిస్థితి జీవఛావము లా మహిళ తల్లి తండ్రులు,శుక్రవారం రాత్రి అంతా ఆమెను మంచానికి కట్టేసి తీవ్రంగా కొట్టి శారీరకంగా చిత్రహింసలకు గురిచేసిన భర్త రామరాజు అతని అనుచరులు 5 మంది మరియుముఖ్య అనుచరుడు గజపతి రాజుఆధ్వర్యంలో ఈ కిడ్నాప్ ప్లాన్ చేసిన రామరాజు గజపతి రాజు వైసీపీ రమేష్ రెడ్డి ముఖ్య అనుచరుడుజరిగిన ఈ ఘటనకు సంబంధించి మహిళ భర్తకు ఆమె తండ్రి కూడా సహరించినట్టు సమాచారంతన భర్తతో ప్రాణహాని ఉందని గత పది రోజుల క్రితం జిల్లా ఎస్పీ గారికి తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేసినా ఒక మహిళకు రక్షణ కల్పించాలేని పరిస్థితి ప్రస్తుతం ఈ జిల్లాలో చూస్తున్నపరిస్థితి,విషయం తెలుసుకున్న ఆమె బంధువులు రాత్రి పోలీసు వారికి తెలపగా ఈరోజు ఉదయం ఘటన స్థలానికి వెళ్ళిన పోలీసులు,ఆమెను కాకులారం నుంచి లక్కి రెడ్డి పల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చిన పోలీసులు,రాత్రంతా ఆమె భర్త వారి అనుచరులు ఆమెను మంచానికి కట్టేసి కొట్టడంతో తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్న మహిళ అయితే ఆమె గతంలో ఇచ్చిన ఫిర్యాదు పై పోలీసులు స్పందించకుండా నిర్లక్ష్యం వహించడం వల్లనే ఒక మహిళకు ప్రాణ రక్షణ లేని పరిస్థితి స్వయంగా జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేసినా ఒక మహిళకు రక్షణ కల్పించలేని స్థితిలో ఉన్న పోలీసు వ్యవస్థగత పది రోజులకు ముందు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గారికి తనకు తన భర్త వల్ల ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసిన కూడా ఆమె సమస్యను పరిష్కరించడంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆమె బంధువుల ఆరోపణ,మేము పోలీసులకు జరిగిన విషయం తెలుపకపోయి ఉంటే ఆమెను చంపేసేవారేమో అంటున్న ఆమె బంధువులు,పోలీసుల నిర్లక్ష్యం వల్ల జిల్లాలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆమె బంధువులుసమస్యల పరిష్కారంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపణప్రస్తుతం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహిళజరిగిన ఈ ఘటనపై పోలీసులు ఆమెకు ఏమి న్యాయం చేస్తారనేది విషయంపై వేచి చూడాల్సిన పరిస్థితి.



## ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు




**చాగలమర్రి , సెప్టెంబర్ 05 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రి అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం ఎస్ అన్సర్ బాషా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలతో సత్కరించారు , కరస్పాండెంట్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రాముఖ్యత మరియు మన జీవితంలో వారికి ఇవ్వాల్సిన ప్రత్యేక స్థానం గురించి పిల్లలకు గొప్ప సందేశాన్ని ఇచ్చారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగాను, రెండవ రాష్ట్రపతి గాను పనిచేసిన గొప్ప భారతీయ తత్వవేత్త, రాజనీతివేత్త. ఉపాధ్యాయ వృత్తికి ఆయన తెచ్చిన గుర్తింపుకు గౌరవంగా ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 5 ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గౌస్ లాజం మాట్లాడుతూ 1962 లో సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత రాష్ట్రపతి అయిన తరువాత కొందరు శిష్యులు మరియు మిత్రులు పుట్టినరోజు జరపడానికి ఆయన వద్దకు వచ్చినపుడు “నా పుట్టిన రోజును వేరుగా జరిపే బదులు దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే” నేను ఎంతో గర్విస్తానని, ఆయన ఉపాధ్యాయ వృత్తి పట్ల తన ప్రేమను చాటారు. అప్పటి నుండి ఆయన పుట్టినరోజును భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలియజేయడం జరిగింది. పాఠశాల విద్యార్థులు టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు మరియు యాజమాన్యం కూడా ప్రతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల సేవలను కొనియాడి ప్రత్యేక బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం ఎస్ అన్సర్ భాషా ప్రధానోపాధ్యాయులు గౌస్ లాజమ్ మరియు ఉపాధ్యాయులు, శ్రీనివాసులు, నాయబ్ రసూల్, సతీష్ కుమార్, మహబూబ్ సాహెబ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు......



**చాగలమర్రి , సెప్టెంబర్ 05 ( ప్రజాజ్యోతి న్యూస్) ;** చాగలమర్రిలోని శ్రీ చైతన్య భారతి ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం నాడు పాఠశాల నందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల కరెస్పాండంట్ పొన్నంపల్లి మల్లికార్జునరావ్ ఉపాధ్యాయ సిబ్బంది పూలమాల వేసి సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు తేదీని ఉపాధ్యాయ దినోత్సవశీ గా ఏర్పాటు చేయడం జరిగిందని భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతిగా మరియు రెండవ దేశ రాష్ట్రపతి గా ఆయన చేసిన సేవలను కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు రఫీ, బాలయ్య, ఉపాధ్యాయులు రసూల్ మరియు ,ఇంగ్లీష్ టీచర్ జావీద్ లు ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడానికి గల కారణాలు సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసినటువంటి సేవలు మొదలైన వాటి గురించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు వినయం సంస్కారం క్రమశిక్షణ అనేవి ఎంతో ముఖ్యమని విద్యార్థులను భావి భారత పౌరులుగా తయారు చేసే నిత్య శ్రామికులు నిరంతర జ్ఞాన స్ఫూర్తి దాతలు ఉపాధ్యాయులే అని ఉపాధ్యాయులు దేశభవితకు వెన్నెముక లాంటివారని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. అనంతరం చైతన్య భారతి పాఠశాల నందు గతం లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించినటువంటి ప్రభుత్వ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం ను పాఠశాల సిబ్బంది శాలువా కప్పి పూలమాలతో సత్కరించడం జరిగింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున్ రావ్ మరియు సీఈవో చంద్రకళను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ పూలమాలవేసి శాలువాతో సత్కరించి వారికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మా మంచి మాస్టారు.. వెంకటేశ్వరరావు

**ఉపాధ్యాయ వృద్ధులు ఆయన సేవలు మరువలేనివి**
**టీచర్స్ డే వేడుకల్లో పూర్వ విద్యార్థుల ప్రశంసలు**
**కవిటం జడ్పీ హైస్కూల్ 94బి95 ఫస్ట్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు**
**విశ్రాంత ఉపాధ్యాయుడు కుక్కల వెంకటేశ్వరరావు ఘన సత్కారం**
**వెంకటేశ్వరరావు మాస్టారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలి**



**ప్రజా జ్యోతి, (పోదూరు), – సెప్టెంబర్ –05 :** కుక్కల వెంకటేశ్వరరావు ఏకైక మా మంచి మాస్టారు అని కవిటం మేడపాటి పరశు రామారెడ్డి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 94బి95 పూర్వ విద్యార్థులు ప్రసంసించారు. కవిటంలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కవిటంలో పనిచేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడిగా, పోదూరు మండల ఎంఈఓగా సేవలందించిన కుక్కల వెంకటేశ్వరరావుకి గ్రామ పెద్దల సమక్షంలో పూర్వ విద్యార్థులు ఘన సత్కారం చేశారు. పూలు, పూలమాలలు, దుస్సాలువ, పండ్లు అందజేసి ఆయనకు నమస్కరించి ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పలువురు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మా మాస్టారు కుక్కల వెంకటేశ్వరరావు సత్కరించటం తమకు గర్వకారణంగా ఉందన్నారు. మాస్టారు ఆనాడే కవిటం హై స్కూల్ లో 80 మంది విద్యార్థులకు 80 మంది ఉత్తీర్ణత సాధించి జిల్లాలోని పాఠశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారన్నారు. ప్రతి సంవత్సరం నూరు శాతం ఉత్తీర్ణతతోపాటు ఆయన బోధించే గణితశాస్త్రంలో వందకి వంద మార్కులు సాధించడం పరిపాటిగా మారిందన్నారు. ఆయన క్రమశిక్షణలో విద్యాబుద్ధులు పొందిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో కొలువులు చేస్తున్నారు అన్నారు. ఆయన నిబద్ధత, అంకితభావం, సమయస్ఫూర్తి, పిల్లల పట్ల ప్రేమానురాగాలు అదే క్రమంలో క్రమశిక్షణ కు సుగుణాలతో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల మానసిక, విద్యాభివృద్ధి మంచి పునాది మా వెంకటేశ్వరరావు మాస్టారు అన్నారు. షేక్ అబ్దుల్ రజాక్ మేడపాటి నాగిరెడ్డి, మేడపాటి యశ్వంత్ రెడ్డి (అడ్వకేట్) పిల్లా చిరంజీవి, దొంగ గవరయ్య, సత్తి వెంకట సీతారామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గురువే దైవం... గురువే మార్గదర్శి...!

## శ్రీ బాపూజీ ఇంగ్లీష్ మీడియం అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం







**హొళగుంద, సెప్టెంబర్ 05,ప్రజా జ్యోతి న్యూస్ -** మండల కేంద్రంలోని శ్రీ బాపూజీ ఇంగ్లీష్ మీడియం అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మన్న విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారని తెలిపారు. 1888 సెప్టెంబర్ 5వ తేదీన తిరుత్తణి గ్రామంలో వీరస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించిన రాధాకృష్ణన్ మధ్యతరగతి కుటుంబంలో జన్మించినప్పటికీ ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించారని పేర్కొన్నారు.ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, వైస్ ఛాన్సలర్‌గా దేశానికి ఎనలేని సేవలు అందిస్తూ అనేక మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. గురువు అంటే కేవలం ఒక వ్యక్తి కాదని,సమాజానికి ఒక ఆదర్శమని,ఒక తరాన్ని మార్చగలిగే అద్భుత శక్తి గురువు అని లక్ష్మన్న అన్నారు.ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించాలని, తల్లిదండ్రుల తర్వాత గురువుకే అత్యున్నత స్థానం ఉందని తెలిపారు. మన పురాణాలు, వేదాలు, పెద్దలు కూడా గురువుకు విశిష్ట స్థానం కల్పించారని, అలాంటి ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించాలని విద్యార్థులకు సూచించారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ఉపాధ్యాయులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మన్న, ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి లను విద్యార్థులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తోటి ఉపాధ్యాయులు కూడా వారిని సన్మానించి అభినందనలు తెలిపారు.వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వేషధారణలో పాల్గొనగా, మరికొందరు విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలంకరించుకుని సందడి చేశారు. వారి ప్రతిభను పాఠశాల యాజమాన్యం అభినందించింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌభాగ్య, అనీసా, పార్వతి, ఫాతిమా, నస్రీన్, హబీబా, ఉమ్మె తహ్య, ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి, కరస్పాండెంట్ లక్ష్మన్నతో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలూరులో వైసీపీకి భారీ షాక్







### టీడీపీ ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో టీడీపీలోకి 500 వాల్మీకి కుటుంబాలు..!

**ఆలూరు,హోళగుంద, సెప్టెంబర్ 05, ప్రజా జ్యోతి న్యూస్ -** ఆలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి భారీ ఊపు లభించింది.ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన సుమారు 500 వాల్మీకి కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి, టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు ఆమె టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాధారంగ ఆహ్వానించారు.పార్టీలో చేరిన ములుగుందం గ్రామస్తులు మాట్లాడుతూ టీడీపీ సిద్ధాంతాలు, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై నమ్మకంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని, భవిష్యత్తులో ఆలూరు టిడిపి ఇంచార్జ వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో టిడిపి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఒకే గ్రామం నుంచి 500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడటంతో ములుగుందంలో టీడీపీ తిరుగులేని శక్తిగా మారింది.రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని చేరికలు ఉంటాయని, కూటమి ప్రభంజనంతో ఆలూరులో టీడీపీ విజయం ఖాయమని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్, ఆలూరు మార్కెట్ చైర్మన్ బిలేకల్ వెంకటేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి

రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలి

హంద్రీ--నీవా నీటితో చెరువులు, కుంటలు నింపాలి

మంత్రులు జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, గొట్టిపాటి రవీంద్రలకు రైతుసంస్యలపై వినతి పత్రం అందజేత

-ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి.



**రాయచోటి సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్నమయ్య జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవీంద్రల కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు సకాలంలో కురవకపోవడం తో జిల్లాలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. పంటలు సాగు చేయలేక ఒకవైపు రైతులు ఇబ్బందులు పడుతుండగా, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు దెబ్బతినడంతో తీవ్ర ఆర్థిక నష్టాలకు గురయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన గడ్డు పరిస్థితులను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల్లో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా జిల్లాలోని అన్ని మండలాల్లో పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటుచేసి ఉచితంగా పశుగ్రాసం అందించాలని కోరారు.హంద్రీ--నీవా కాలువ ద్వారా నీటిని సమర్థవంతంగా తరలించి జిల్లాలోని చెరువులు, కుంటలు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా సాగు, తాగునీటి అవసరాలకు నీటి లభ్యత కల్పించాలని కోరారు.కరువు కారణంగా నష్టపోయిన రైతులపైవున్న బ్యాంకు రుణాలను మాఫీ చేసి, వారికి తక్షణమే కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టమోటా, మామిడి తదితర ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని, చేతికందిన ఉద్యాన పంటల ఫలాలను నిల్వ ఉంచుకోవడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన సదుపాయాలతో పాటు మార్కెటింగ్ వసతులు కల్పించి, తక్కువ ధరలకు పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితిని నివారించాలని సూచించారు. కరువు ప్రభావిత రైతులకు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడి తదితర ప్రభుత్వ సహాయాన్ని తక్షణమే అందించాలని కోరారు.రైతులకు సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ అవసరాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని రంగారెడ్డి వారిని కోరారు. అన్నమయ్య జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి జాప్యం చేయకుండా తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో రైతులు అన్నయ్య రవి సుబ్బయ్య మల్లయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# హామీ ఇచ్చారు.. నిధులు మంజూరు చేశారు..

ఇదే విజనరీ సి ఎం చంద్రబాబు మార్క్ పాలన...!

సాగునీటి రంగానికి రూ.1,942.80 కోట్లతో భారీ ఊతం

----- ఆలూరు టిడిపి ఇంచార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి



**ఆలూరు/హోళగుంద, సెప్టెంబర్ 05, ప్రజా జ్యోతి న్యూస్ -** ఆస్పరి సంజీవని గ్రామసభలో ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకువస్తూ, నీటిపారుదల ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లను ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారనీ,ఇది సీఎం చంద్రబాబు మార్క్ పాలన అని ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, అన్నదాతల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులకు ప్రభుత్వం భారీ స్థాయిలో అనుమతులు మంజూరు చేయడం రైతాంగంలో కొత్త ఆశలు నింపుతోందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రూ.1,942.80 కోట్ల విలువైన పెండింగ్ సాగునీటి పనులకు అనుమతులతో సుమారు 80 వేల ఎకరాలకు సాగునీటి వసతితో పాటు 196 గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకుని అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ ముందుకు సాగుతున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సాగు మరియు తాగునీటి అవసరాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. హామీ నుంచి అమలు వరకు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే చంద్రబాబు పాలన ప్రత్యేకత అని ఈ సందర్భంగా ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం

- వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు



**మెళియాపుట్టి (ప్రతినిధి): పి రవికుమార్ రెడ్డి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 05** మెళియాపుట్టి మండలం, పరుశురాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నందవ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మెళియాపుట్టి మండల వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు గారు హాజరై, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే మార్గదర్శకులు అని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర చిరస్మరణీయమని అన్నారు.భారత మాజీ రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు వి. వనజ గారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ావీజ చైర్మన్ విశాఖ రావు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రావులపాలెం - వాడపల్లి ఏటిగట్టుకు 7 కోట్ల రూపాయలతో నూతన రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



**ఆలమూరు సెప్టెంబర్ 5(ప్రజాజ్యోతి):**216ఏ జాతీయ రహదారి రావులపాలెం గౌతమీ నది ఏటిగట్టు నుండి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ రోడ్డు వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఏటిగట్టు రహదారి పనులకు శనివారం నాడు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ లు శంకుస్థాపన చేశారు. 6 కోట్లు సాస్కి నిధుల నుండి, రుడా నుండి కోటి రూపాయల నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. స్వామి వారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయితీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే సత్యానందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఏటిగట్టు ప్రాంతాన్ని, రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో రహదారి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలు, రైతులు, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండా సురేఖకు అధికారిక భద్రత ఉపసంహరించుకున్న రేవంత్

**హైదరాబాద్ :** తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భద్రతను పూర్తిగా ఉపసంహరించుకుంది. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి హోదాలో ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మన్లను ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే ఆమె భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను రద్దు చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా నిలిచిపోయాయి.ప్రోటోకాల్ నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఒక వ్యక్తి మంత్రి పదవిలో లేనప్పుడు, వారికి కేటాయించిన ప్రత్యేక భద్రతను ఉపసంహరించడం సాధారణ ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, మంత్రి పదవి నుంచి తొలగించిన వెంటనే ఇంత వేగంగా భద్రతను వెనక్కి తీసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది కొండా కుటుంబానికి ప్రభుత్వం పంపిన ఒక బలమైన సంకేతంగా కొందరు భావిస్తున్నారు.ఈ వరుస పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానాన్ని ఎలా మలచుకుంటారనే అంశం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె తదుపరి అడుగులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్

**హైదరాబాద్ :** ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు.స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు చంద్రబాబు శుభాకాంక్షలు.. సర్వేపల్లి జీవితం ఆదర్శనీయం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంపీటీసీలకు ఘనంగా సన్మానం



**ప్రజా జ్యోతి, చెన్నూరు సెప్టెంబర్ 5** శనివారము చెన్నూరు మండలం మండల పరిషత్ సమావేశం మండల అధ్యక్షుడు చీర్ల సురేష్ యాదవ్ గారి అధ్యక్షతన మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు అలాగే అధికారులు అందరూ పాల్గొనడం జరిగింది ఎంపీటీసీ సభ్యులందరికీ ఇది లాస్ట్ మీటింగ్ కావడంతో అధికారులందరూ హాజరైన ఎంపిటిసి సభ్యులను అందర్నీ ఘనంగా సత్కరించడం జరిగింది ఎంపీటీసీ సభ్యులందరూ మాకు ఈ పదవి రావడానికి కారకులైన మా గ్రామ ప్రజలు అలాగే వైఎస్ఆర్సిపి పార్టీ అలాగే ఆనాడు కమలాపురం శాసనసభ్యులు ఈనాడు కడప జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు పెద్దలు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి గారికి అలాగే కమలాపురం నియోజకవర్గం ఇన్చార్జి వరులు పోచం రెడ్డి నరేన్ రామాంజులరెడ్డి గారికి ఈ ప్రజాసేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రతి ఒక్కరూ ఎంపిటిసి సభ్యులు వారిరువురికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది అలాగే ఐదు సంవత్సరాలు సమస్యలు లేవనెత్తినప్పుడు ఓపిగ్గా విని కొన్ని పరిష్కరించేందుకు కృషిచేసిన అధికారులందరికీ పేరుపేరునా ఎంపీటీ సభ్యులందరూ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది ఈనెలాఖరుతో ఎంపిటిసి సభ్యుల పదవీకాలం ముగియడంతో ఈ పదవి పొందడానికి సహకరించిన వైఎస్ఆర్సిపి పార్టీకి వైఎస్ఆర్సిపి పార్టీ అప్పటి శాసనసభ్యునికి ప్రత్యేకించి చేతులు జోడించి పేరుపేరునా ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది

## చాయ్ దునియా టీ స్టాల్ ను ఆవిష్కరించిన బండారు శ్రీనివాస్.



**ఆలమూరు సెప్టెంబర్ 5(ప్రజాజ్యోతి):**ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ హై స్కూల్ రోడ్లో చాయ్ దునియా టీ స్టాల్ ను కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆవిష్కరించారు. ప్రక్కన మరో షాప్ బాలాజీ ఫోమ్ వాష్ సెంటర్ ను జనసేన పార్టీ నాయకులు చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్, చింతలూరు సొసైటీ చైర్మన్ నల్ల వెంకన్న ఆవిష్కరించి స్వయంగా బైకును ఫోమ్ వాష్ చేసి అందరి కి ఆకర్షితులయ్యారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ మరింత అభివృద్ధి చెంది వ్యాపారంతో పాటు పార్టీని కూడా ముందుకు నడిపించాలని వచ్చిన కార్యకర్తలు నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, చల్లా బాబి, పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా వారిని నడిపించింది గురువులే.

**గురుపూజోత్సవంలో ఇస్రో శాస్త్రవేత్త కొట్టి వెంకట సుధాకర్.**



**పోడూరు. ప్రజా జ్యోతి సెప్టెంబర్ 5.** ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వారిని ఆ స్థాయికి నడిపించింది గురువులేనని ఇస్రో శాస్త్రవేత్త కొట్టి వెంకట సుధాకర్ పేర్కొన్నారు. పోడూరు మండలం వేడంగి లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు భూపతిరాజు వెంకట నరసింహారాజు, కొట్టి సూర్యనారాయణ వెంకట నర్సమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో శాస్త్రవేత్త సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జీవితంలో తల్లిదండ్రుల తరువాత ప్రాధాన్యత గురువులకే దక్కుతుందన్నారు. విద్యార్థులు నేడు అందరికీ అందుబాటులో ఉంటున్న సాంకేతిక పరిజ్ఞానంకు సంబంధించిన అంశాలను తెలుసుకోవాలన్నారు. భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధన సంస్థ దేశాన్ని సాంకేతికంగా ముందుకు నడిపించడంలో ఎంతో ముందంజలో ఉందన్నారు. రేకట్ లతో శాటిలైట్ లను అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగా అవి భూమి చుట్టూ తిరుగుతూ ప్రజానీకానికి సాంకేతికం గా ఎంతో ఉపయోగ పడతున్నాయన్నారు. కమ్యూనికేషన్ సాటిలైట్ వైఫై ఇంటర్నెట్ వంటి పరిజ్ఞానాన్ని అందిస్తుంటే యావిగేషన్ శాటిలైట్ భూమిపైన రానున్న ప్రమాదాలు వచ్చిన ప్రమాదాల పరిస్థితి, పరిస్థితి ఎప్పటికప్పుడు తెలియజేస్తుందన్నారు రిమోటింగ్ శాటిలైట్ భూమిపైన వాతావరణ మార్పులు వర్షాలు వరదల పరిస్థితులు సూచిస్తాయన్నారు. అంతరిక్ష సంస్థ సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సుధాకర్ తెలిపారు. అన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు భూపతిరాజు వెంకట నరసింహరాజు మాట్లాడుతూ గురువులకు శిష్యులే సిరి సంపదలని అన్నారు. తమ శిష్యులు ఉన్నత స్థానాలకు ఎదిగితే వారిని చూసి గర్వించేది గురువులేనన్నారు. ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తు ను తీర్చిద్దిద్దే ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి పెద్దిరాజు మాట్లాడుతూ గురువులను ఎప్పుడూ గౌరవించే వారు వారి తల్లిదండ్రులను అదే విధంగా గౌరవించే స్థాయిలో ఉంటారన్నారు. ఉన్నత స్థానాలకు ఎదిగిన విద్యార్థులు పలువురు తాము చదివిన పాఠశాలల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. గురుపూజోత్సవం కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రామచందర్రావు అధ్యక్షత వహించగా తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు అతిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాధా కృష్ణన్ జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. దగ్గులూరు మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి శ్రీనివాసరాజును ఆయన శిష్యుడు శాస్త్రవేత్త వెంకట సుధాకర్, ట్రస్ట్ చైర్మన్ కొట్టి భాస్కర రావు సన్మానించగా వేడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సత్తి నాగ పరమేశ్వరి ని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పొన్నపల్లి రమేష్ లను భూపతి రాజు వెంకటనరసింహారాజు,సుబ్బరాజు సన్మానించారు అనంతరం గురుపూజోత్సవం జరిపిన అతిథులను మండల విద్యాశాఖ అధికారి జి విజయకుమార్ సత్కరించారు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొండేటి దుర్గ సత్య శ్రీ కలిదిండి సుబ్బరాజు కొట్టి రామం పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి, ప్రభుత్వమే అక్కా గృహాలు నిర్మించాలని 12వ పిఆర్సి ని వెంటనే అమలు చేయాలి

### డైలీ వేజెస్ వర్కర్స్ కు పెండింగ్లో ఉన్న 5నెలల వేతనాలు చెల్లించాలి మదనపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన

### నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి





**మదనపల్లి సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి** మదనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ , ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవా, సీనియర్ నాయకుడుమస్తాన్,డిమాండ్ చేశారు.మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం కోసం ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నేటికీ సొంత ఇంటి స్థలం, గృహాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కార్మికులందరికీ మదనపల్లి రూరల్ వెంకప్పకోట పంచాయతీలో గతంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే పారిశుద్ధ్య కార్మికులకు నాణ్యమైన పనిముట్లు, రక్షణ పరికరాలు అందించాలని, పెరుగుతున్న జనాభా మరియు పట్టణ విస్తరణకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు.డైలీ వేజ్ కార్మికులకు గత ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 31వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.12వ పిఆర్సిని వెంటనే అమలు చేయాలని ,గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ మదనపల్లి పట్టణ కార్యదర్శి మాధవ్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మదనపల్లి మున్సిపాలిటీ కార్యదర్శి తిరుమల, ఇంద్రాణి,రాధా, నర్సింహులు, అల్లాభక్షు కదిరెప్ప పి.నరసింహులు, వెంకటరమణ, మల్లిఖార్జున,నరసమ్మ తదితరులు పాల్గొన్నారు

# గురువుల సేవలు.. సమాజానికి వెలకట్టలేని సంపద

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం

### ఎటపాక మండలానికి చెందిన ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):**భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భద్రాచలంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యారంగానికి విశేష సేవలందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎటపాక మండలం నుంచి ఐదుగురు, భద్రాచలం ప్రాంతం నుంచి ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి రోటరీ క్లబ్ ప్రతినిధులు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఎటపాక మండలం నుంచి సన్మానం పొందిన వారిలో మండల విద్యాశాఖ అధికారి సరియం రాజులు, కె.ఎన్.పురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్యామల శంకరయ్య, నెల్లిపాక జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ బుద్దా విజయలక్ష్మి, కె.ఎన్.పురం జి.పి.ఎస్. పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు జి. అచ్చమ్మ, చింతలగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ బి. ఇందిర ఉన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ అజీమ్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు నైతిక విలువలను నేర్పుతూ, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే సమా జాన్ని విద్యను గౌరవించుకోవడమేనని అన్నారు. కార్యక్రమం లో రోటరీ క్లబ్ కార్యదర్శి పాపినేని రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణ, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్లు యశోద రాంబాబు, గుప్తా, వీరయ్య, రఫీ, బాలాజీ, చైతన్య, శేషుకుమార్, చలపతి, సందీప్, వందవాసు శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాలలో మిన్నంటిన 'టీచర్స్ డే' సంబరాలు





**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు**పెద్దవడుగూరు.స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కలిసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ కరణం నారాయణ రావు జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాల్లో అజ్ఞానమనే చీకట్లను తొలగించి జ్ఞాన దీపాలను వెలిగించే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉందని కొనియాడారు. విద్యార్థులను క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులు గా మార్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని, ఆదర్శ విద్యా నికేతన్ ఉపాధ్యాయ బృందం అందిస్తున్న విద్యా సేవలు ఎంతో అభినందనీయమని ఆయన స్పష్టం చేశారు.వేడుకల్లో భాగంగా పాఠశాల సీనియర్ విద్యార్థులు ఉపాధ్యాయుల దుస్తులు ధరించి, ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి చిన్న తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయ వృత్తిలోని బాధ్యతను, సవాళ్లను స్వయంగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు మరియు గురువుల గొప్పతనాన్ని చాటే నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులకు విద్యార్థులు ప్రత్యేక గ్రీటింగ్ కార్డులు, పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయ పూర్వక 'గురువందనం' సమర్పించారు.పాఠశాల ప్రిన్సిపాల్ కరణం నారాయణ రావు చేతుల మీదుగా ఉపాధ్యాయులం దరినీ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. విద్యాబోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఓదులపల్లి వారి వివాహ మహోత్సవ వేడుకలో పాల్గొన్న డాక్టర్ చల్లా.



**ఆలమూరు సెప్టెంబర్ 5(ప్రజాజ్యోతి):**మండలం కేంద్రం ఆలమూరు ఎస్ వి ఎస్ కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం జరిగిన పశువైద్యులు డాక్టర్ ఓదులపల్లి రామకృష్ణ,డాక్టర్ అనిత దంపతుల ఏకైక కుమారుడు శ్రీ సూర్య–అంజలా కిరణ్ ల వివాహ మహోత్సవ వేడుకలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి, దీవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు.ఈ కార్యక్రమంలో వంటిపల్లి విశ్వనాధం, ఆలమూరు ఏఎంసి మాజీ చైర్మన్ దున్నే స్వామి నాయుడు, జగన్నాయకులపాలెం మాజీ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, గుమ్మిలేరు మాజీ సర్పంచ్ గుణ్ణం రాంబాబు,ఆలమూరు గ్రామ మాజీ ఉపసర్పంచ్ చల్లా నానాజీ,చల్లా భూషణం, ఎలుగుబంట్ల సాయిబాబు,ఎలుగుబంట్ల బూరయ్య,చల్లా సూరిబాబు,లంకే వెంకటరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం 100% విజయవంతం






**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం మరియు యువనేత గుత్తి పామిడి ఇంచార్జ్ గుమ్మనూరుఈశ్వర్ ఆదేశాల మేర కు ఈరోజు పామిడి పట్టణంలోని 7వ వార్డ్లో "ఇంటింటికి–తెలుగుదేశం" కార్యక్రమం చేపట్టి పూర్తిచేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ సెక్రెటరీ కరూర్ శివశంకర్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి నిరంజన్, గడ్డం షెక్షావలి, 238 బూత్ కన్వీనర్ జాఫర్ సాహెబ్, 237బూత్ కన్వీనర్ చల్లా రామకృష్ణ , 239 బూత్ కన్వీనర్ కరూర్ హరికృష్ణ పాల్గొనడం జరిగింది

## శ్రావణ మాస ఉత్సవాలు విజయవంతం

**సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు**

**-- ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పాలకమండలి సభ్యులు సుధాకర్**



**హోళగుంద, సెప్టెంబర్ 05, ప్రజా జ్యోతి న్యూస్ –** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు నెల రోజుల పాటు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడినట్లు ఆలయ పాలకమండలి సభ్యులు సుధాకర్ తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు సుధాకర్, అయ్యప్ప, రంగస్వామి మాట్లాడుతూ, స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో తమ మొక్కులు తీర్చుకునేలా, భక్తులు కోరుకున్న కోరికలు నెరవేరాలనే సంకల్పంతో అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. శ్రావణమాస ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన ఆలయ చైర్మన్, ఈవో, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, అలాగే వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు పాలకమండలి సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామివారు ఈరోజు సాయంత్రం 4 గంటలకు కందుకూరు సమీపంలోని నదికి స్నానానికి బయలుదేరనున్నారని, అనంతరం రేపు తిరిగి ఉరుకుందకు చేరుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే స్వామివారి ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకమండలి సభ్యులు కోరారు.

# గురువే జ్ఞాన జ్యోతి జీవితానికి మార్గదర్శి





## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం

**రాయచోటి సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి** తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జ్ఞానాన్ని అందించి విద్యార్థుల జీవితానికి సరైన మార్గాన్ని చూపుతారని, గురువు చూపిన మార్గమే విజయానికి బాటవుతుందని ఎస్.వి. విద్యామందిర్ హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి.ఎస్. హరినాథ్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో శనివారం రాయచోటిలోని ఎస్.వి. విద్యామందిర్ హైస్కూల్లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పాఠ్యపుస్తకాల్లోని విషయాలను బోధించడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించడంలో గురువుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. లయన్ పి.ఎస్. హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ గురువు సమాజ నిర్మాణానికి మూలస్తంభం అని అన్నారు. విద్యార్థులు గురువులను గౌరవిస్తూ, వారు చూపించే మంచి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులను గమనిస్తూ చెడు అలవాట్లకు, దుష్ప్రవర్తనకు దూరంగా ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, నిజాయితీ, మానవతా విలువలను అలవర్చుకొని ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, శాలువాలు, జ్ఞాపికలతో అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి చిత్ర మేడం, ఉపాధ్యాయులు రెడ్డప్ప రెడ్డి, రామాంజనేయ రెడ్డి, ప్రసాద్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురువులే.. సమాజానికి దిక్సూచీలు!

### రౌటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### పద్మావతి హాస్పిటల్స్‌లో 10 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం







**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమోఘమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రౌటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం ఆధ్వర్యంలో పద్మావతి హాస్పిటల్స్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన 10 మంది ఉపాధ్యాయులను వారి సేవలను గుర్తిస్తూ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్‌లను అందజేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన డా. శ్రావణి కొమ్మూరు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, వారి జీవితాలకు సరైన దిశానిర్దేశం చేస్తారని అన్నారు. మంచి ఉపాధ్యాయుడు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. పద్మావతి తల్లి పిల్లల హాస్పిటల్స్, పద్మావతి డయాగ్నస్టిక్ సెంటర్ సీఈఓ డా. మల్లంపాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి విజయానికి వెనుక ఉపాధ్యాయుడి ప్రోత్సాహం, మార్గదర్శనం ఉంటాయని అన్నారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రిటైర్డ్ ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సిటీ స్టైల్ జిమ్ కోచ్, జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, ఎంపీటీసీ గుండాల రామిరెడ్డి గోంగడి మాట్లాడుతూ.. విద్యతో పాటు ఆరోగ్యం, క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమని తెలిపారు. యువతను సన్మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యమని అన్నారు. రౌటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ భద్రాచలం మాజీ అధ్యక్షుడు డా. రమేష్ మాట్లాడుతూ.. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ఆనందంగా ఉందని అన్నారు క్లబ్ కోశాధికారి రవి కుమార్ దొబ్బల మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారి అంకితభావాన్ని గుర్తించి సన్మానించడం సంతోషకరమని తెలిపారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులు: డి. జయ (ఎంపీపీఎస్, నెలిపాక), బి. ప్రసాద్ (ఎంపీపీఎస్, లక్ష్మీపురం), బి.వి. ప్రసాద్ (ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పురుషోత్తపట్నం), బి. అరుణ (జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, భద్రాచలం), పి. శ్రీనివాసి (జెడ్పీహెచ్ఎస్, పినపల్లి), టి. శ్రీనివాసరావు (ఎంపీపీఎస్, గాంధీనగర్, సారపాక), కె. శ్రీదేవి (జెడ్పీహెచ్ఎస్, సారపాక), బి. ఇందిర (ఎంపీపీఎస్, చింతలగూడెం), సి.హెచ్. శ్రీనివాసరావు (జెడ్పీహెచ్ఎస్, నర్సాపురం), ఎస్. శశిదేవి (సోషల్ వెల్ఫేర్ పాఠశాల, పాల్వంచ ). కార్యక్రమం అనంతరం పద్మావతి హాస్పిటల్స్ సిబ్బంది, రౌటరీ క్లబ్ సభ్యులు, సన్మానం పొందిన ఉపాధ్యాయులు కలిసి కేక్ కట్ చేసి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి సముచిత గౌరవం అందించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది.

# క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సత్తా చాటిన ఎస్‌ఆర్‌ఐటీ




**-78 మంది ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు**




**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలోని శ్రీ రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌ఆర్‌ఐటీ) కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో సత్తా చాటారు. ప్రముఖ గ్లోబల్ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిర్వహించిన నియామక ప్రక్రియలో కళాశాలకు చెందిన 78 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. టీసీఎస్ నియామక ప్రక్రియలో ప్రైమ్ విభాగం కింద 18 మంది విద్యార్థులు రూ.9.08 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌సీ నుంచి 7 మంది, సీఎస్‌ఎం నుంచి 5 మంది, ఈసీఈ నుంచి 4 మంది, ఈఈఈ నుంచి ఇద్దరు ఉన్నారు. అదేవిధంగా డిజిటల్ విభాగం కింద 32 మంది విద్యార్థులు రూ.7.09 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌సీ నుంచి 13 మంది, సీఎస్‌ఎం నుంచి 12 మంది, ఈసీఈ నుంచి 7 మంది ఉన్నారు. నింజా విభాగం కింద మరో 28 మంది విద్యార్థులు రూ.3.4 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు. వీరిలో సీఎస్‌సీ నుంచి 9 మంది, సీఎస్‌ఎం నుంచి నలుగురు, ఈసీఈ నుంచి ఆరుగురు, ఈఈఈ నుంచి ఏడుగురు, ఎంఈసీ నుంచి ఇద్దరు ఉన్నారు. ఒకే సంస్థలో కళాశాలకు చెందిన 78 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, ఇంటర్వ్యూ శిక్షణ అందిస్తున్నామని సాంబశివారెడ్డి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల కృషి, ప్లేస్‌మెంట్ విభాగం అందించిన ప్రత్యేక శిక్షణతోనే ఈ విజయాన్ని సాధించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. జి. బాలకృష్ణ, కళాశాల వైస్ ప్రెసిడెంట్ డా. ఎం. రంజిత్ రెడ్డి, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ విభాగం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాల గురుసేవకు ఘన గౌరవం

**ఉపాధ్యాయురాలు గుంపెనపల్లి అచ్చమ్మకు రోటరీ క్లబ్ సన్మానం**

**విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం: ఎస్.కె. అజీమ్**




**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** నాటికి నేటికీ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, పవిత్రమైన వృత్తిగా ఉపాధ్యాయులు సమాజంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె. అజీమ్ అన్నారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఎటపాక మండలంలోని కేఎన్.పురం ఆశ్రమ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట దేవదానం, ఉపాధ్యాయురాలు గుంపెనపల్లి అచ్చమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.కె. అజీమ్ ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.కె. అజీమ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయురాలిగా గుంపెనపల్లి అచ్చమ్మ సుమారు 40 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించారని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆమె కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ఉపాధ్యాయులకు సమాజం అందించే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు బాపినేని రాజేష్, పలివెల రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొని సన్మాన గ్రహీతలను అభినందించారు.

## అభివృద్ధి.. సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**లక్ష్మీపురంలో టీడీపీ డోర్‌టు డోర్ ప్రచారం**



**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని 285, 286, 287 బూత్‌ల పరిధిలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమం ప్రతి ఇంట్లో కనిపిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం కోటి ఇళ్లకు పైగా చేరుకోవడం ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన పాలన అందిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయేలా పాలన అందిస్తుందన్న విశ్వాసాన్ని కణితి మధు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలను మలిచే శక్తి గురువులదే

**బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు**



**బాపట్ల సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. గురువుల సేవలు, త్యాగాలు సమాజం ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం బాపట్లలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాయి గార్డెన్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ. ఉపాధ్యాయ వృత్తితో జీవితాన్ని ప్రారంభించి దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం ద్వారా గురువుల గొప్పతనాన్ని గుర్తుచేసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి లక్షణాలను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. తరగతి గదిలో గురువు చెప్పే ప్రతి మాట విద్యార్థుల జీవితంపై ప్రభావం చూపుతుందని, మంచి గురువు సమాజానికి మంచి పౌరులను అందించగలరని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ, మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గురువుల సూచనలు, ఆశీస్సులు విద్యార్థుల ఉన్నతికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాసం 4వ శనివారం శ్రీశ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవస్థానంలో విశేష పూజలు

**సత్తెనపల్లి కి చెందిన చందోలు వెంకట మల్లికార్జున రావు అన్నదానం**




**గుంతకల్లు సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** కసాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవాలయంలో శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు తలారి శకుంతలమ్మ, ఆలయ ధర్మకర్త తలారి తేజ ప్రాత:కాలం స్వామివారికి విశేషంగా అలంకరణ పూజ కార్యక్రమాలు నిర్వహించా రు. భక్తాదులు స్వామివారి దర్శనార్థం కొరకువిశేషంగా తరలి రావడం జరిగింది. శ్రావణమాసం సందర్భంగా భజన బృందం వారు శ్రీ అద్ద కొండ అక్కమ్మ తల్లి భజన బృందం వారు కేశవాపురం గ్రామం గార్లదిన్నె మండలం అనంతపురం జిల్లా భజన సంకీర్తనలతో తిలకించారు. భజన బృందం అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి రామచంద్ర శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి నిత్యాన్నప్రసాద వితరణ సత్తెనపల్లి కి చెందిన చందోలు వెంకట మల్లికార్జున రావు భార్య పేరు మీదగా శివ సత్యవతి అన్నదాన కార్యక్రమం చేయించారు.ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తాలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపకులు కుటుంబ సభ్యులు ఆలయ అర్చకులు దేవస్థానసిబ్బంది అన్నదాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో బాపట్ల పోలీసుల ప్రతిభ

**పతక విజేతలను అభినందించిన ఎస్పీ బి.ఉమామహేశ్వర్**



**బాపట్ల సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో బాపట్ల జిల్లా పోలీస్ సిబ్బంది 36 పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఐపీఎస్ అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని శనివారం తన క్యాంప్ కార్యాలయంలో అభినందించి సత్కరించిన ఆయన.. పతక విజేతలకు జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక రివార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు.సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు జరిగిన తొలి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్,2026లో గుంటూరు రేంజ్ తరపున బాపట్ల జిల్లా నుంచి 14 మంది పాల్గొని 9 స్వర్ణాలు, 17 రజతాలు, 10 కాంస్య పతకాలు సాధించారు. బాపట్ల టౌన్ సీఐ ఆర్.రాంబాబు లాన్ టెన్నిస్‌లో స్వర్ణం సాధించగా, కర్లపాలెం కానిస్టేబుల్ వి.నరేంద్ర మూడు స్వర్ణాలతో ఐదు పతకాలు దక్కించుకున్నారు.చీరాల,1 టౌన్ మహిళా కానిస్టేబుల్ జి.సునీత ఆరు, చీరాల--2 టౌన్ మహిళా కానిస్టేబుల్ సి.హెచ్.సునీత మూడు, పీజీఆర్ఎస్ సెల్ కానిస్టేబుల్ పి.నాగబ్రహ్మారెడ్డి ఈతలో ఏడు పతకాలు సాధించారు. వెదుళ్లపల్లి మహిళా కానిస్టేబుల్ నాగవాణి ఐదు పతకాలతో ప్రతిభ కనబరిచారు. ఏఆర్ కానిస్టేబుల్ ఎం.నరేష్‌బాబు బాడీబిల్డింగ్‌లో స్వర్ణం, రెజ్లింగ్‌లో కాంస్యం సాధించారు. డాగ్ స్క్వాడ్ ట్రాకర్ విభాగంలో జి.వి.ఎస్.నాగకుమార్, ఎం.గోపి రజత పతకాలు సాధించగా, కబడ్డీలో ఎం.వెంకటరెడ్డి, ఎన్.వి.సుబ్బారెడ్డి, బి.నాగఆంజనేయులు, ఎన్.స్వరూప రజతాలు దక్కించుకున్నారు. వి.శివశంకర్ హ్యాండ్‌బాల్‌లో కాంస్య పతకం సాధించారు. జిల్లా పోలీస్ జాగిలం షాడో సైతం రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రోఫీతో పాటు రజత పతకం సాధించింది.క్రీడలు పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు. విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపే సిబ్బందిని ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ షేక్ మోలుద్దిన్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## గురువులే విద్యార్థుల భవితకు మార్గదర్శకులు

**నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో**

**ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**






**నెల్లిపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల అధ్యాపకులు లాడే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగుల్ మీరా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగుల్ మీరా, కళాశాల అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశ విద్యారంగానికి డాక్టర్ రాధాకృష్ణన్ అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగుల్ మీరా మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు నైతిక విలువలను పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం కళాశాల అధ్యాపకులకు ప్రిన్సిపాల్ నాగుల్ మీరా బహుమతులను అందించి సత్కరించారు. దీంతో అధ్యాపకులు, విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కట్టా వెంకటరమణ, వృక్షశాస్త్ర అధ్యాపకులు రూప, పౌరశాస్త్ర అధ్యాపకులు జనార్దన్ రావు, అర్థశాస్త్ర అధ్యాపకులు కళ్యాణి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు కళ్యాణ్, జంతుశాస్త్ర అధ్యాపకులు భార్గవి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలమూరు శ్రీ జనార్దన స్వామివారి ఆలయంలో గరుడాళ్వార్ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమం.బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ

**ఆలమూరు సెప్టెంబర్ 5(ప్రజాజ్యోతి):**నారద ప్రతిష్ఠిత నవ జనార్ధన ఆలయాల్లో అత్యంత ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన స్వామివారి వాహనమైన గరుడాళ్వార్ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమాలు వేద విహితంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, ఆలమూరు మండలానికి చెందిన కూటమి నాయకులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో బండారు శ్రీనివాస్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మూలమూర్తిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన హోమాలు ,పూర్ణాహుతి సమర్పించారు. తదుపరి భక్తులంతా జయ జనార్దన గోవిందా.... గరుడ వాహన గోవిందా... అంటూ జయ జయ ధ్వానాలు చేస్తుండగా బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా గరుడాళ్వార్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ 5000 ఏళ్ల నాటి నారద మహర్షి ప్రతిష్ఠిత నవ





జనార్ధన ఆలయంలో దాస్య భక్తికి, మాతృభక్తికి ప్రతీక అయిన గరుడాళ్వార్ విగ్రహ ఏర్పాటు ఎంతో అభినందనీయమని వ్యాఖ్యానించారు. ఇందుకు కృషిచేసిన ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు, భక్తులను అభినందించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక భక్తుడు కొమ్మిశెట్టి శ్రీనివాస్ సౌజన్యంతో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నరేంద్ర కుమార్, ఈదల సత్తిబాబు,ఈదల నల్ల బాబు, వంటిపల్లి సతీష్, రామానుజుల శేషగిరిరావు, నల్లా వెంకన్న, సంగిత సుభాష్, గారపాటి శ్రీనివాస్ చౌదరి, సలాది జేపీ, కొత్తపల్లి వెంకటలక్ష్మి, కొత్తపల్లి నగేష్, సయ్యపరాజు శ్రీనివాసరాజు, పడాల అమ్మి రాజు, వీరి అప్పారావు, భావన శివ శంకర్, గుత్తుల నాగేశ్వరరావు, శిరిగినేడి పట్టాభి, చల్లా బాబి, చల్లా వెంకటేశ్వరరావు, దేశాభక్తుల సత్యనారాయణ, అడబాల వీర్రాజు, కేతా రాంబాబు, పసుపులేటి సాయిబాబా, బండారు బాబి తదితర నాయకులతో పాటు అశేష సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

## గురువుల సేవలతోనే సమాజానికి దిశానిర్దేశం

### 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**బాపట్ల సెప్టెంబరు 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అన్నారు. సమాజానికి మంచి మార్గాన్ని చూపే శక్తి గురువులకే ఉందని పేర్కొన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని బాపట్లలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయి గార్డెన్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.





అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి, పుష్పమాలలు, బే ఆఫ్ బాపట్ల కిట్లు, అవార్డులను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు ఎంతో నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారని అన్నారు. వందలాది మంది విద్యార్థుల్లో జ్ఞానం, వివేకం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ వారి జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. తాను ఐఏఎస్‌కు ఎంపికైన అనంతరం తొలిసారిగా తనకు శిక్షణ ఇచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారికి గురుపూజోత్సవం సందర్భంగా ఫోన్ చేసి శు భాకాంక్షలు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు.తన జీవితంలోనూ ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ తెలిపారు. ఇంజినీరింగ్ చదవాలని భావించిన సమయంలో బయాలజీలో మంచి మార్కులు రావడంతో తన ఉపాధ్యాయులు అనురాధ, సురేఖలు వైద్య విద్య వైపు వెళ్లేలా ప్రోత్సహించారని చెప్పారు. వారి ప్రోత్సాహంతో ఎంబీబీఎస్‌లో చేరి కర్ణాటక రాష్ట్రంలో 53వ ర్యాంకు సాధించినట్లు తన అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయ, వైద్య వృత్తులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉందని, అలాంటి గొప్ప వృత్తిలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను అభినందించడం ఆనందంగా ఉందన్నారు.

బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ. సమాజంలో మంచి వ్యవస్థను నిర్మించగల సామర్థ్యం ఉపాధ్యాయులకు ఉందన్నారు. విద్య, విజ్ఞాన సాధనకు పేదరికం అడ్డంకి కాదని, విద్యార్థులు ఆసక్తితో చదువుకునేలా ప్రోత్సహించడంతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించే దిశగా బోధన సాగాలని సూచించారు. తరగతి గదిలోని ప్రతి విద్యార్థిని సొంత బిడ్డగా భావించి వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య మాట్లాడుతూ. ఉపాధ్యాయుడిగా, దేశాధ్యక్షుడిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రతిఉపాధ్యాయుడికి ఆయన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. సమాన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ఉపాధ్యాయుల సేవలను అభినందించారు. జన్మనిచ్చేది తల్లిదండ్రులైతే.జీవితానికి దిశ, విలువలు నేర్పేది గురువులేనని అన్నారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, ఆర్డీవో హరికుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ చివుకుల దుర్గాప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బారావు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల కోసం ఐక్య పోరాటం




### పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలపై ఏపీజేఏసీ అమరావతి నిరసన

**బాపట్ల సెప్టెంబరు 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**ఉద్యోగుల న్యాయమైన హక్కులు, పెండింగ్ ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ఐక్యంగా పోరాడతామని ఏపీజేఏసీ అమరావతి బాపట్ల జిల్లా చైర్మన్ సురేష్‌బాబు స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని కోరుతూ శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో హ్యాండ్ టు హ్యాండ్ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు సైతం గణనీయ సంఖ్యలో హాజరై తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ముందుకు సాగుతామని నినదించారు.ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు చేస్తున్నది కేవలం నిరసన కాదని, తమ హక్కుల కోసం సాగిస్తున్న ఆత్మగౌరవ పోరాటమని పేర్కొన్నారు. విధులు, బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు న్యాయబద్ధంగా అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కూడా ప్రభుత్వం సకాలంలో అందించాలని కోరారు. పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలు, 2018 నుంచి రావాల్సిన బకాయిలు తదితర సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తారని తెలిపారు.పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలతో ఉద్యోగులపై ఆర్థిక భారం పెరుగుతున్నప్పటికీ డీఏలు సకాలంలో అందకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపారు. తమకు రావాల్సిన మొత్తాలను మాత్రమే అడుగుతున్నామని, ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించాలని కోరారు.ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.రజని మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మహిళా ఉద్యోగుల పాత్ర కూడా కీలకమని అన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే విధుల్లో అంకితభావంతో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా రావాల్సిన డీఏలు, పీఆర్సీ తదితర ప్రయోజనాలను ఇకపై ఆలస్యం చేయకుండా ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం మహిళా ఉద్యోగులంతా సంఘటితంగా నిలబడి ఏపీజేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణకు పూర్తి మద్దతు ఇస్తారని రజని స్పష్టం చేశారు.ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన వచ్చే వరకు రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ ప్రకారం దశలవారీగా కార్యక్రమాలను కొనసాగిస్తామని సురేష్‌బాబు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అన్ని ఉద్యోగ సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో కార్యదర్శి ఎస్‌కె. హాజరబేగం, ఏపీఆర్ఎస్ఏ సిటీ యూనిట్ అధ్యక్షుడు ఎస్‌కె. మహబూబ్ బాషా, కార్యదర్శి ఏ. సుమంత్‌రాజ్, ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర కార్యదర్శి బి.టి. వలి, జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, ఏపీ కో-ఆపరేటివ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, కార్యదర్శి అరుణ్‌కుమార్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయం, సర్వే శాఖ, సివిల్ సప్లైస్, ఆర్టీసీ, కో-ఆపరేటివ్, జిల్లా ట్రెజరీ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సేవకులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పంచాయతీరాజ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ గుమ్మకోట గ్రామపంచాయతీ కమిటీ ఉపాధ్యక్షుడు కొర్రసోములు.

**పరామర్శించే నాయకులే తెలుగుదేశం పార్టీలో కరువు.**



**అనంతగిరి మండలం. సెప్టెంబర్ 5. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం గుమ్మకోట గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కొర్ర సోములు కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది రెండు రోజులు క్రితం డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే ఒక కుటుంబం ఆ కుటుంబంలోని వ్యక్తి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న. అనారోగ్యంతో బాధపడుతున్న పరమార్శించి ఆదుకునే సాంప్రదాయం తెలుగుదేశం పార్టీలో ఉంది అలాంటి సాంప్రదాయ తెలుగుదేశం పార్టీలో ఉన్న మండల నాయకులు గానీ. గుమ్మకోట పంచాయతీ నాయకులు గానీ అనారోగ్యంతో బాధపడుతున్న కొర్ర సోములను పరామర్శించిపలకరించే నాధుడే తెలుగుదేశం పార్టీలో లేదంటే ఎంత బాధాకరమో నాయకుల తీరును చూస్తే అర్థమవుతుంది. పార్టీకి కష్టపడి పని చేసే కార్యకర్తను ఆదుకోవలసిన బాధ్యత తెలుగుదేశం పార్టీకి ఉండాలి.

## గొల్లప్రోలు మండలం కొడవలిలో విషాదం: పాముకాటుతో రైతు మృతి



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పాముకాటుకు గురై ఓ రైతు మృతి చెందిన విషాద సంఘటన గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది.పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొడవలి గ్రామానికి చెందిన తెలుకుల కులానికి చెందిన బుర్ర నాగ సత్తిబాబు (43, తండ్రి: రాజారావు అనే రైతు శనివారం ఉదయం 7:30 గంటల సమయంలో వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి వెళ్లారు. పొలంలో పని చేసుకుంటున్న సమయంలో ఉదయం సుమారు 8:30 గంటలకు ఆయన కుడికాలుపై ఒక గుర్తుతెలియని విషసర్పం కాటు వేసింది.దీనిని గమనించిన పక్క పొలంలోని తోటి రైతులు వెంటనే అప్రమత్తమై, సత్తిబాబును మోటార్ సైకిల్‌పై ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో ఉదయం 9:30 గంటల ప్రాంతంలో సత్తిబాబు చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే మృతి చెందారు.ఈ ఘటనపై గొల్లప్రోలు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం ఏఎస్ఐ వి. త్రినాథ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం పార్థివ దేహాన్ని మృతుని రక్తసంబంధీకులకు అప్పగించారు.

## వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**జీలుగుమిల్లి : 05 సెప్టెంబర్ జీలుగుమిల్లి : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** తాను ఆచరిస్తూ, విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలతో కూడిన సంస్కారాల్ని, జ్ఞానాన్ని అందించే వాడే నిజమైన ఉపాధ్యాయుడని భారతరత్న డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణ గారి యొక్క జీవితాన్ని అటు ఉపాధ్యాయులు ఇటు విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని వాల్మీకి విజ్ఞాన కేంద్రం ఉపాధ్యాయులు వేదుల జనార్దనరావు అన్నారు, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి 138 జయంతి సందర్భంగా నేడు వంకవారి గూడెం వాల్మీకి విజ్ఞాన్ కేంద్రం పాఠశాల నందు " ఉపాధ్యాయ దినోత్సవం " జరిగింది. అకడమిక్ ఇన్చార్జి ఉర్రింకల శివశంకర్ సభకి అధ్యక్షత వహిస్తూ, డాక్టర్ రాధాకృష్ణ చిత్రపటానికి పుష్పమాలను వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి కామేశ్వరి. విద్యార్థులు చైతన్య, బాల భార్గవి, తన్మయి, నిహారిక లు ప్రసంగించగా, కే గౌరి శ్రీ, పేరం మహేష్, పి అమల తదితరులు పాల్గొన్నారు.వేదుల జనార్ధన రావు.

## బాలలే గురువులైన వేళ.. బోధనలో భళా

**శ్రీ ఆదిత్య స్కూల్‌లో ఘనంగా స్వయం పాలన దినోత్సవం**



**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** బాలలే గురువులుగా మారి పాఠాలు బోధించిన వేళ పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎటపాక మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్‌లో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరెస్పాండెంట్ వెంకట్, ప్రిన్సిపల్ వెంకట రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాల నిర్వహణ బాధ్యతలను సైతం విద్యార్థులే చేపట్టారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వివిధ తరగతుల్లో పాఠ్యాంశాలను విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి బోధించారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు టైం టేబుల్ ప్రకారం ఏ విధంగా తరగతులను నిర్వహిస్తారో అదే విధంగా విద్యార్థులు కూడా తరగతులను నిర్వహించడం విశేషంగా నిలిచింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు అనుభవాలే ముఖ్యమైన పాఠాలని అన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ విద్యార్థులకు బోధించేందుకు ఎంత కష్టపడుతున్నారో ఈ కార్యక్రమం ద్వారా వారికి అవగాహన కలుగుతుందని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రసన్న, నాగేశ్వరరావు, సంధ్య, శ్రీనివాసరావు, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, జయంతి, ఇమాన్సి, వాసవి, వెంకటలక్ష్మి, శివాదేవి, శిరీష, ఆస్మా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లగుప్ప గ్రామాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించాలి

**జమున మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్**

**బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం.. ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి**





**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే గొల్లగుప్ప గ్రామాన్ని సందర్శించి క్లోరోక్విన్ మాత్రల వినియోగంతో అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం విస్సాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగుప్ప గ్రామంలో ఆయన పర్యటించి ఇటీవల మృతి చెందిన మడివి జమున కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జమున తల్లి మాట్లాడుతూ.. తన కుమార్తెకు నాలుగు మాత్రలు ఇచ్చారని, అవే ఆమె చివరి మాటలని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. జమున మృతి అనంతరం ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి హామీ అందలేదని, ఇప్పటివరకు ఏ అధికారి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలతో మాట్లాడలేదని గ్రామస్తులు శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మడివి జమున మృతి విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీయడం మినహా బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ పెద్దలు చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే ఈపాటికే బాధిత కుటుంబానికి న్యాయం జరిగి ఉండేదన్నారు. అమరావతిలో ఉండి 'అడవి తల్లికి బాట వేస్తున్నా' అంటూ ప్రచారం చేసుకోవడం కాదని, నిజంగా గిరిజనుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించాలని పవన్ కళ్యాణ్‌కు సూచించారు. రహదారుల నిర్మాణం, విద్యుత్ సదుపాయాల కల్పనకు అటవీశాఖ నుంచి అవసరమైన అనుమతులు, అభ్యంతరాల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. క్లోరోక్విన్ మందుల వినియోగంపై పలు దేశాల్లో ఆంక్షలు ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలో వాటి వినియోగం జరుగుతోందని శ్రీనివాసరావు ఆరోపించారు. ప్రభుత్వం సరఫరా చేసిన మాత్రలు తీసుకున్న అనంతరం గిరిజన బాలిక మృతి చెందిందని, దీనిపై ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జమున మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ గొల్లగుప్ప గ్రామాన్ని సందర్శించకపోవడం, జమున కుటుంబాన్ని పరామర్శించకపోవడం, బాధితులతో మాట్లాడకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఇటీవల మలేరియాతో మృతి చెందిన పద్దం రోజా డెత్ సర్టిఫికెట్‌ను వైద్య సిబ్బంది తిరిగి తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. జమున మృతదేహానికి అర్ధరాత్రి పోస్టుమార్టం నిర్వహించడం, గ్రామంలోకి సీపీఎం నాయకత్వాన్ని వెళ్లకుండా అడ్డుకోవడం, పోలీసుల పహారాలో హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించడం వంటి పరిణామాలు ప్రభుత్వ నిర్లక్ష్యం, తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయని శ్రీనివాసరావు ఆరోపించారు. మడివి జమున కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, గొల్లగుప్ప గ్రామానికి రహదారి నిర్మించాలని, విద్యుత్ సదుపాయం కల్పించాలని సీపీఎం తరఫున డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. గిరిజన గ్రామాలకు రహదారులు, విద్యుత్, మంచినీరు, నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అయితే అధికారులు, పాలకులు ఆ బాధ్యత నుంచి తప్పుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి., వి.ఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, ఎటపాక మండల కార్యదర్శి కాకా అర్జున్, మండల కమిటీ సభ్యులు పి. బాలకృష్ణ, సోందే రామారావు, పూనెం వెంకట్రావు, ఆదివాసీ అడ్వకేట్ మడివి రవితేజ, కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజేతలో ఘనంగా గురుపూజోత్సవం





**తాళ్లపూడి, సెప్టెంబర్ 5 ప్రజాజ్యోతి న్యూస్** డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శ్రీ విజేత హై స్కూల్ నందు గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంను రంగు రంగుల బెలూన్ లతోఅలకరించారు. కార్యక్రమంలో డా సర్వేపల్లి చిత్రపటానికి విద్యార్థులు ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేస్తూ కేక్ కట్ చేసి పంచి పెట్టారు.పాఠశాల విద్యార్థులు ఆయా తరగతి ఉపాధ్యాయులకు శాలువా, పూల మాల వేసి బహుమతులు అందచేశారు.అనంతరం గురువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందికి బహుమతులు అందచేశారు. టీచర్స్ డే ను పురస్కరించుకుని టీచర్స్ కి నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. పాఠశాల అధ్యాపక బృందం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియచేసి గిఫ్ట్ అందచేశారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఎం కరుణ, సి ఎచ్ తేజస్వని, ఎస్ వర్ధన్ రాజు, కె వెంకట్, వై విజయ్, కె గంగారత్నం, కె సలోమి, సాయి లత, ప్రసన్న, రాజేశ్వరి మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎస్. జయమ్మ




**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** అనంతపురం జిల్లా పామిడి మండలం ఎదురూరు గ్రామంలోని వీరాా పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్. జయమ్మకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు లభించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారి ప్రతిభను వెలికితీసేందుకు నిరంతరం కృషి చేస్తున్న జయమ్మ సేవలను గుర్తించిన అధికారులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి సత్కరించారు. విద్యార్థుల పట్ల ఆప్యాయత, బోధనలో నిబద్ధత, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఎస్. జయమ్మకు అభినందనలు తెలిపారు.

## నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**గుంతకల్లు సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ డి. గోవిందరాజులు హాజరై రిటైర్డ్ ఉపాధ్యాయు లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయు ల పాత్ర ఎంతో గొప్పదని, విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు మరియు సామాజిక బాధ్యతలను నేర్పడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయు లను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నారాయణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను కూడా ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. పేదలు, వృద్ధులు మరియు అవసర మైన వారికి మరింత మెరుగై న సేవలు అందించేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అలాగే ట్రస్ట్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించి, గత సేవా కార్యక్రమాలపై సమీక్ష జరిపి, రాబోయే నెలలో నిర్వహించాల్సిన ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమా లపై నెలవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందిం చారు. కమిటీ సభ్యులకు వివిధ బాధ్యతలను కేటాయించి, సేవా కార్యక్ర మాలను మరింత సమర్థవం తంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో నారాయణ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, సేవాభావం కలిగిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# అడుగడుగునా నిఘా చివరకు కర్నాల్‌లో పట్టుబడ్డాడు

**సాంకేతిక ఆధారాలతో బాలిక ఆచూకీ.**

**కిడ్నాప్, పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్**



**గుంటూరు సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాలతో పోలీసులు చేపట్టిన దర్యాప్తు ఫలించింది. గుంటూరులో అదృశ్యమైన 15 ఏళ్ల బాలిక ఆచూకీని సాంకేతిక ఆధారాలతో హర్యానాలోని కర్నాల్‌లో గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. బాలికను తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ జాన్ సైదా అలియాస్ రబ్బాని అలియాస్ పండు (21) ను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టాభిపురం రవీంద్రనగర్‌కు చెందిన బాలిక జూన్ 9న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పట్టాభిపురం ఎస్ఐ ఎం. రాజ్‌కుమార్ క్రైం నంబర్ 317/2026 కింద గర్ల్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో బాలికను ఉప్పుటూరు గ్రామానికి చెందిన షేక్ జాన్ సైదా తీసుకెళ్లినట్లు గుర్తించారు.ఫోన్ డేటా, సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కదలికలను పరిశీలించిన పోలీసులు.. నెల్లూరు, మధురై, కోయంబత్తూరు, పాలక్కాడ్, హైదరాబాద్ మీదుగా కర్నాల్ చేరుకున్నట్లు గుర్తించారు. ఐటీ కోర్ బృందం సాంకేతిక సహకారంతో కర్నాల్‌లో ఆచూకీ గుర్తించి బాలికను సురక్షితంగా తీసుకొచ్చారు. నిందితుడిని శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ చేశారు.విచారణలో బాలికతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడినట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మహిళా ఎస్ఐ పి. తరంగిణి బాలిక స్టేట్‌మెంట్ నమోదు చేయగా, కేసులో బీఎన్ఎస్ 137(2), 65(1), పోక్సో చట్టంలోని 5(ఎల్), 6 సెక్షన్లను అదనంగా చేర్చారు. నిందితుడిపై పర్చూరు పోలీస్ స్టేషన్‌లో గతంలో ఎఫ్ఐఆర్ 43/2025 కింద కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. క్రైమ్ ఎస్పీ (ఎన్‌సీ) కె. సుప్రజ, వెస్ట్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి. శ్రీనివాసరావు, పట్టాభిపురం సీఐ జి. వెంకటేశ్వర్లు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. నిస్సార్ బాషా పర్యవేక్షణలో దర్యాప్తు సాగింది.బృందంలో ఎస్ఐలు ఎం. సుబ్బారావు, ఎం. రాజ్‌కుమార్, ఎన్.సి. ప్రసాద్, అశోక్, డబ్ల్యూ ఎస్ ఐ పి. తరంగిణి, డబల్యూ ఏ ఎస్ ఐ వై. సరస్వతి, హెచ్‌సీలు బి. నరసింహారావు, కె. కోటేశ్వరరావు, పి. ప్రసాదరావు, పీసీలు బి. ప్రేమ్‌కుమార్, టి. గోపి, వై. మాణిక్యరావు, డబ్ల్యూ పిసి పి. జ్యోతి, ఐటీ కోర్ టీమ్ రాము, పీసీ సాయి, సాయికుమార్, సిసిఎస్ బృందం సభ్యులు ఉన్నారు. బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

# గడపకు చేరని ప్రభుత్వ వైద్యం.. సంచి వైద్యుల దందాకు దారితీస్తోందా?

**అర్హతపై స్పష్టత లేని వ్యక్తి వద్ద ఇంజెక్షన్లు, స్టెరాయిడ్లు.. మలేరియా చికిత్సకు ఉపయోగించే మందులూ దర్శనం**

**ఆర్ఎంపీ యూనియన్ సభ్యత్వమే అర్హతా? గ్రామాల్లో ప్రాణాలతో చెలగాటమాడుతున్న అనధికారిక వైద్యం**

**ప్రిస్క్రిప్షన్ మందులు సంచి వైద్యుల చేతికి ఎలా చేరుతున్నాయి? ఫార్మసీలు, హోల్‌సేల్ డీలర్లపై నిఘా ఎక్కడ?**

**సాలూరు,ప్రజా జ్యోతి:–** సాలూరు, మక్కువ మండలాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే అధికారిక లెక్కలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య ఎంతటి వ్యత్యాసం ఉందో మరోసారి ప్రశ్నార్థకంగా మారింది.గిరిజన గ్రామాల్లో వైద్య సేవల కొరతను ఆసరాగా చేసుకుని అర్హతలు, అనుమతులు స్పష్టంగా లేని వ్యక్తులు వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల చెన్నేరు పంచాయతీ పరిధిలోని ఎగువ మెండంగి గ్రామంలో గిరిజన యువకుడి మృతిపై చర్చ జరుగుతున్న సమయంలోనే, అదే ప్రాంతంలో ఓ వ్యక్తి ఎలాంటి అధికారిక వైద్య అర్హత పత్రాలు చూపకుండా వైద్యం చేస్తున్న దృశ్యాలు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. విలేకరుల సమక్షంలోనే వైద్యం చేస్తున్నట్లు కనిపించిన ఆ వ్యక్తి, తనకు ఉన్నది ఆర్ఎంపీ యూనియన్ సభ్యత్వం మాత్రమేనని తెలపటం. యూనియన్ సభ్యత్వం అనేది ప్రభుత్వ వైద్య అర్హతకు లేదా ఆధునిక వైద్యం చేయడానికి చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్‌కు ప్రత్యామ్నాయం కాదా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన ప్రశ్న. స్టెరాయిడ్ ఇంజెక్షన్ ఎందుకు? ఇది ఔషధం. ఏ రోగికి, ఏ కారణంతో, ఎంత మోతాదులో, ఎంతకాలం ఇవ్వాలన్నది వైద్యపరమైన నిర్ణయం.కాబట్టి అర్హత లేని వ్యక్తి ఇంజెక్షన్లను స్వయంగా ఎంచుకుని రోగులకు ఇస్తున్నాడా? అనే అంశంపై వైద్య ఆరోగ్యశాఖ విచారణ చేయాల్సిన అవసరం ఉంది.ఇది కేవలం ఒక వ్యక్తి వద్ద మందులు కనిపించాయనే అంశం కాదు.ఆ మందులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు విక్రయించారు ఎవరి ప్రెస్క్రిప్షన్ పై వచ్చాయి? కొనుగోలు బిల్లులు ఉన్నాయా? అన్నది అధికారులు విచారణలో తేల్చాలి.“ప్రభుత్వ సిబ్బంది సక్రమంగా పనిచేస్తే మేమెందుకు ఇక్కడికి వస్తాం?”ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యకరమైన అంశం ఇదే.విలేకరుల సమక్షంలో అనధికారిక వైద్యం చేస్తున్న వ్యక్తి ప్రభుత్వ వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తే ప్రజలు తమ వద్దకు ఎందుకు వస్తారని ప్రశ్నించినట్లు సమాచారం.ఈ వ్యాఖ్యను సాధారణంగా కొట్టిపారేయలేం.ఎందుకంటే ఇందులో ప్రభుత్వ వైద్య వ్యవస్థ వైఫల్యానికి సంబంధించిన తీవ్రమైన ప్రశ్న ఇది.గ్రామానికి వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా వస్తున్నారా? పీహెచ్సీలు, సబ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయా? రాత్రివేళ అత్యవసర వైద్యం అందుతోందా? మలేరియా, డెంగ్యూ, ఇతర జ్వరాల పరీక్షలు గ్రామస్థాయిలో జరుగుతున్నాయా? గర్భిణులు, పిల్లలు, వృద్ధులకు నిరంతర వైద్య సేవలు అందుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు సంతృప్తికరంగా లేకపోతే, సహజంగానే అనధికారిక వైద్యుల వైపు ప్రజలు వెళ్లే ప్రమాదం ఉంటుంది. మలేరియా మందు.. ఎవరి సూచనతో? సాధారణ నొప్పి లేదా జ్వరానికి వేసే సాధారణ ఇంజెక్షన్ కాదు. తీవ్రమైన మలేరియా చికిత్సలో ఉపయోగిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఒవజవతీవ ఆర్టీసునాటే ను ప్రాణరక్షక చికిత్సగా పేర్కొంది ఇలాంటి ఇంజెక్షన్స్ ను ఓ సాధారణ ఆర్ఎంపీ వద్ద ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. అందువల్ల గ్రామీణ ప్రాంతంలో ఎవరికైనా జ్వరం వచ్చిందని నిర్ధారణ లేకుండానే ఇలాంటి ఇంజెక్షన్లు ఇవ్వడం జరిగిందా?
మలేరియా పరీక్ష నిర్వహించారా?
రోగి పరిస్థితిని అంచనా వేశారా?
డోస్‌ను ఎవరు నిర్ణయించారు?
తీవ్ర పరిస్థితి ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారా?
అన్న ప్రశ్నలకు వైద్య ఆరోగ్యశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది.






సంచి వైద్యుల దోపిడీనా.. ప్రభుత్వ వైద్య వ్యవస్థ వైఫల్యమా? ఏజెన్సీ ప్రజలకు అర్హత కలిగిన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ బాధ్యతలో ఖాళీ ఏర్పడిన చోట అనధికారిక వైద్యం ప్రవేశిస్తే, ఆ ఖాళీని ఎవరు భర్తీ చేస్తున్నారు? ఎందుకు భర్తీ చేస్తున్నారు? ఎవరి అండతో కొనసాగుతున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు కావాలి.ఒక వైపు అర్హత లేని వ్యక్తులు వైద్యం చేస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు.. మరోవైపు ప్రభుత్వ వైద్య సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండటం లేదనే ప్రజల ఆవేదన.. మధ్యలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గిరిజన ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. గడపకు చేరాల్సిన ప్రభుత్వ వైద్యం గడప దాటకపోతే.. ఆ ఖాళీలో సంచి వైద్యం పెరుగుతుంది. ఆ ఖాళీని పూడ్చాల్సింది అనధికారిక వైద్యులు కాదు.. ప్రభుత్వం.

# మర్రిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవం**





**కూనవరం సెప్టెంబర్ 5. ప్రజా జ్యోతి** కూనవరం: మండలంలోని మర్రిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవంతో పాటు విద్యార్థుల స్వయం పాలన దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరోజు పాటు ఉపాధ్యాయులుగా మారి తమ తమ తరగతుల్లో పాఠాలను బోధించారు. ఉపాధ్యాయులుగా తమ అనుభవాలను విద్యార్థులు పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే స్వయం పాలన దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోడే వెంకట్రావు తెలిపారు.అలాగే వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధా, అనిల్ కుమార్, భవాని, సీత, శాంతి, కాళేశ్వరరావు, రాజులు, మమత, ఆనంద్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి సమాజానికి ఉపాధ్యాయులే దిక్సూచి







**– సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతమైనది**

**– విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడినప్పుడే ఉపాధ్యాయులకు అసలైన గౌరవం**

**– రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ అనకాపల్లి విజయలక్ష్మీ**

**పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్:** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతమైనదని, విద్యార్థులు మంచి ప్రవర్తనను అలవర్చుకుని క్రమశిక్షణ తో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ప్రతీ ఒక్క ఉపాధ్యాయుని ఆకాంక్ష అని రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచిన ఆచార్యులు,మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఏం వాగ్దేవి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి విజయలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని అన్నారు.తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, ఉపాధ్యాయులు వారికి విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దుతారని తెలిపారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తికి, విద్యా రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో మంచి నడవడిక, క్రమశిక్షణ, మానవతా విలువలను పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవడంతో పాటు ఉపాధ్యాయులను గౌరవించి, వారి సూచనలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని విజయలక్ష్మీ ఆకాంక్షించారు. సమాజానికి మంచి పౌరులను అందించడమే ఉపాధ్యాయ వృత్తి యొక్క అసలైన గొప్పతనమని ఆమె పేర్కొన్నారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు తమ గురువుల పట్ల గౌరవాభిమనాలను చాటుకున్నారు. ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించి వారిని ఉత్సాహంగా పాల్గొనేలా చేశారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులతో కలసి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా స్ఫూర్తిని తెలియజేశారు. ఈ పోటీలు పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ కార్యక్రమంలో సుజాత ,మెట్ట గోవింద రావు సి.వి శ్రీనివాస రావు తదితర ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సర్వేపల్లి జయంతి వేడుకలు

**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడమే నిజమైన గురుదక్షిణ**

**ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు..ఘనంగా సన్మానం**





**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడమే ఉపాధ్యాయులకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని విఆర్ పురం ఎంఈఓ, సీతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబురావు అన్నారు. ఎటపాక మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా, సందడిగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతాపురం గౌరీదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ సమాజం ప్రస్తుతం పెడదారి పడుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల్లో విచక్షణా జ్ఞానం కొరవడుతోందని, నేటి బాలల్లో భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యం లేకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సాధారణ స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగి దేశానికి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గౌరీదేవిపేట ప్రధానోపాధ్యాయిని స్వరాజ్యలక్ష్మి, శ్రీను, సునీత, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ మార్చి లార్డ్స్ బుద్ధ అవార్డు పొందిన మాస్టర్ దయాకర్



బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 05 (ప్రజా జ్యోతి) హైదరాబాద్ నగరంలో శనివారం జరిగినటువంటి గ్లోబుల్ మార్స్ లార్డ్స్ బుద్ధ అవార్డు కార్యక్రమంలో మన బద్వేలు ప్రాంతానికి చెందినటువంటి ప్రముఖ కరాటే మాస్టర్ యన్.దయాకర్ అవార్డు పొందడం జరిగిందని తెలిపారు. ఈ అవార్డు ను ఎన్నో సంవత్సరాల నుంచి కరాటే కి సేవలు అందిస్తూ, ఎంతోమంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పథకాలు సాధించేటట్లు శిక్షణ ఇచ్చినందుకుగాను ఈ అవార్డు పొందించడం జరిగింది. ఈ అవార్డు మాస్టర్ దయాకర్ గారికి రావడం పట్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలు, ప్రాంతాలకు చెందినటువంటి 450 మంది మాస్టర్లు పాల్గొన్నారన్నారు. అవార్డును సినీ, సీరియల్ యాక్టర్స్ శివం శివరాత్రి, గబ్బర్ సింగ్ సాయిబాబా, దువ్వూరి సంజయ్ , చైల్డ్ ఆర్టిస్ట్ సుహాని నాథ్, కరాటే గురు మాస్టర్ కేశవ గౌడ్ లు అందించడం జరిగిందని తెలిపారు.

## కరిబండిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**తాళ్లపూడి, సెప్టెంబర్ 5,ప్రజాజ్యోతి న్యూస్** విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నిరంతరం గురువు తపిస్తాడని, భవిష్యత్తుకు బాటలు వేసే గురువు స్థానంలో ఉన్నవారిని ఎప్పుడు గౌరవించాలని కళాశాల ప్రిన్సిపాల్ పి. మురళి పేర్కొన్నారు. మండలంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.?తాళ్లపూడిలోని కరిబండి విద్యా సంస్థలఆధ్వర్యంలోని ఎస్కేజటీఆర్ అండ్ ఎస్ఎస్కే జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్కేఎస్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కరిబండి త్రినాధ స్వామి, ప్రిన్సిపాల్ పి. మురళి, వైస్ ప్రిన్సిపాల్ డి. మాధవరావు, అధ్యాపకులు పాపారావు, ఎం. సత్యనారాయణ, రవీంద్ర, సత్య, రాజువర్ధన్, అమరేంద్ర, గీత, శ్రావంతి, రాధ లక్ష్మి, పద్మ కుమారి, దుర్గ, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు

## నల్లబ్యాడ్జీలతో గొల్లప్రోలు రెవెన్యూ సిబ్బంది నిరసన విధులు



**గొల్లప్రోలు, సెప్టెంబర్ 5: (ప్రజా జ్యోతి)** ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది వినూత్న నిరసన చేపట్టారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గొల్లప్రోలు మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక, అర్థికేతర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, ఐదు డీఏల బకాయిల విడుదల, సిపిఎస్ రద్దు వంటి 29 ప్రధాన డిమాండ్ల సాధనకై జేఏసీ పిలుపునిచ్చిన మూడు దశల ఆందోళనల్లో భాగంగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రజలకు సేవలు అందిస్తూనే నల్లబ్యాడ్జీలతో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, ఆర్ఐలు, విఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏరిగేరి పాఠశాల నందు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**కౌతాళం,సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి** ఎరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎరిగేరిలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీరాములు మరియు గ్రామ పెద్ద బసవరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సన్మానించిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీరాములుకి,గ్రామ పెద్దలు బసవరాజుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయుల పట్ల సమాజం చూపిస్తున్న గౌరవం,అభిమానం మరింత బాధ్యతతో విద్యార్థులకు సేవ చేయడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు మాట్లాడుతూ, "ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాల ను బోధించే వ్యక్తి మాత్రమే కాదు విద్యార్థుల జీవితానికి



దిశానిర్దేశం చేసే మార్గదర్శి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి.ఒక మంచి గురువు తన జ్ఞానంతో విద్యార్థికి వెలుగునిచ్చి, క్రమశిక్షణ,విలువలు, మానవతా దృక్పథాన్ని పెంపొందిస్తాడు. విద్యార్థి విజయానికి వెనుక ఒక గురువు కృషి,త్యాగం, ఆశీస్సు లు తప్పక ఉంటాయి" అని అన్నారు.విద్యార్థులలో గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావం పెంపొందించడం ఎంతో అవసరమని, ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర



పోషిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా ముగిసింది.

# పోలీస్ షూటింగ్ లో సత్తా చాటిన హెడ్ కానిస్టేబుల్ అమ్మాజీ



**3 సిల్వర్ మెడల్స్ కైవసం**

**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:**విధి నిర్వహణతో పాటు క్రీడా రంగంలోనూ ప్రతిభ కనబరుస్తూ శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖకు తమ్మినేని అమ్మాజీ గర్వకారణంగా నిలిచారు. శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె ప్రతిష్టాత్మక పోలీస్ షూటింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మూడు సిల్వర్ మెడల్స్ సాధించారు.ఏపీ పోలీస్ డ్యూటీ స్టేట్ మీట్ షూటింగ్ విభాగంలో ఒక సిల్వర్ మెడల్, ఫస్ట్ ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించి అమ్మాజీ సత్తా చాటారు.విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తూనే షూటింగ్‌పై ఆసక్తితో నిరంతరం కఠోర సాధన చేస్తూ పోటీల్లో అత్యంత ఏకాగ్రత, ఖచ్చితమైన గురితో అద్భుత ప్రదర్శన కనబరిచారు.

**గతంలోనూ పతకాల పంట :**

షూటింగ్ క్రీడలో అమ్మాజీకి ఇది తొలి విజయం కాదు.




గతంలోనూ రాష్ట్ర, జాతీయ స్థాయి షూటింగ్ పోటీల్లో సుమారు ఎనిమిది పతకాలను సాధించారు.గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో తన ప్రతిభను చాటుకున్న ఆమె తాజాగా మరో మూడు సిల్వర్ మెడల్స్ సాధించి తన విజయ పరంపరను కొనసాగించారు.

**అమ్మాజీ గురికి అభినందనల వెల్లువ :**

మూడు సిల్వర్ మెడల్స్ సాధించిన తమ్మినేని అమ్మాజీని పోలీస్ అధికారులు, సహచర సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తూ పతకాలు సాధించడం అభినందనీయ మని ప్రశంసించారు.

**పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం :**



అమ్మాజీతో పాటు పలువురు పోలీస్ క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ద్వారా విశాఖపట్నం రేంజ్‌తో పాటు శ్రీకాకుళం జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం పట్ల ప్రజలు, పోలీస్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మహిళా పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిగా నిలిచిన అమ్మాజీ భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్‌గా యర్రబల్లి అభిలాష్




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)ఆధ్వర్యంలో మచిలీపట్నంలో సెప్టెంబర్ 4,5 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో కాశినాయన మండలానికి చెందిన యర్రబల్లి అభిలాష్ ను కడప--అన్నమయ్య రెండు జిల్లాల విభాగ కన్వీనర్‌గా నియమించారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపొందింపు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అభిలాష్ ఏబీవీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. విద్యార్థుల హక్కుల కోసం పలు కార్యక్రమాలు,ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ సంస్థ బలోపేతానికి కృషి చేశారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన విభాగ్ కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ.. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఏబీవీపీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, విద్యార్థులను సంఘటితం చేయడం,విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఏబీవీపీ రాష్ట్ర శాఖకు,సంభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి సత్యనారాయణ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.2018 నుంచి ఏబీవీపీలో పనిచేస్తున్నానని, గతంలో పోరుమామిళ్ల నగర కార్యదర్శిగా, బద్వేలు భాగ్ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, కడప జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్‌గా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు అభిలాష్ తెలిపారు. ప్రస్తుతం కడప--అన్నమయ్య జిల్లాల విభాగ్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.విభాగ్ పరిధిలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బడుగువానిలంకకు రూ 50 లక్షల పుష్కరాల నిధులు

**ఆలమూరు సెప్టెంబర్ 5(ప్రజాజ్యోతి):**వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు సంబంధించి కొత్తపేట నియోజవర్గం ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి రూ.50 లక్షల మంజూరు అయ్యాయి. ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఇక్కడున్న పుష్కర ఘాట్ విశిష్టతను ఉన్నతాధికారులకు వివరించి ఈ నిధులను మంజూరు చేయించారు.త్వరలో పనులు ప్రారంభించనున్నారు. బడుగువానిలంక గయ్యాలు నుంచి పుష్కర ఘాట్ రోడ్డు వరకు మధ్యలో ఉన్న గ్రావిల్ రోడ్డు సుమారు 230 మీటర్లను సిమెంట్ రోడ్డు వేస్తారు. అలాగే ఇక్కడే పాయ ఉన్నందున లోతట్టు ఉండటంతో వరదల సమయంలో నీరు నిలిచిపోతుంది.అందుకునే ఆ ప్రదేశంలో తూరలు వేసి మినీ కల్వర్టు నిర్మిస్తారు.ఈ సిమెంట్ రోడ్డుతో పాటు పుష్కర ఘాట్ వద్ద మరో 100 మీటర్లు పొడవునా సిమెంట్ రోడ్డును పొడిగించడానికి ఈ నిధులను వినియోగిస్తారు. 2015 గోదావరి పుష్కరాలకు ఇక్కడ రోజూ వేలాది మంది భక్తులు పుష్కర స్నానాలు చేశారు. రాజమహేంద్రవరం అఖండ గోదావరికి అత్యంత సమీపంలో ఈ పుష్కర ఘాట్ ఉంటుంది.చెముడులంక నాలుగు లైన్ల జాతీయ రహదారికి కిలోమీటర్నర దూరంలో పచ్చని పంట పొలాల మధ్యన ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే



ఈ పుష్కర ఘాట్ లో స్నానాలు చేయడం కొత్త అనుభూతి నిస్తుంది.చెముడులంక ఏటిగట్టు వద్ద కూడా ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రూ.30 లక్షలు మంజూరు చేయించి తారు రోడ్డు నిర్మించారు. అలాగే రానున్న పుష్కర సమయానికి ఆ గ్రామంలోని మరింత అభివృద్ధి పనులు చేయడానికి కూడా ఎమ్మెల్యే బండారు కృత నిశ్చయంతో ఉన్నారు. దేశ విదేశాలలో వ్యాపార ఉద్యోగాలు చేసుకునే వారంతా గోదావరి పుష్కరాల సమయానికి సొంత గ్రామాలకు తరలి వస్తారు. వారందరితో ఎంతో సందడిగా పన్నెండేళ్ళ పుష్కరాల పండుగ జరగనుంది.

# అరసవల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా పాపారావు మాస్టర్ ప్రమాణస్వీకారం




**- స్వామివారి సన్నిధిలో అభినందనలు తెలిపిన జనసేన నాయకులు**

**- ఘనంగా సన్మానించిన పార్టీ శ్రేణులు**

**శ్రీకాకుళం , ప్రజాజ్యోతి న్యూస్:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియమితులైన ఆముదాలవలస నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పాత్రుని పాపారావు మాస్టర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆయనను జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు (కేఎంఆర్), సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, శ్రీకాకుళం జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు మురపాక రాజశేఖర్, ఎచ్చెర్ల యువ నాయకులు కాకర్ల బాబాజీతో పాటు పలువురు జనసేన పార్టీ కార్యకర్తలు పాపారావు మాస్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ కుటుంబ సభ్యుల తరఫున పాపారావు మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియ జేస్తూ, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి సేవలో ఆయన మరింతగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. నూతనంగా చేపట్టిన పవిత్రమైన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని కోరారు. ఆయన పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని జనసేన నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

# ఉత్తమ సేవలకు జిల్లా స్థాయి ప్రతిభ పురస్కారాలు



**ఎటపాక మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు సత్కారం**

**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** విద్యా శాఖలో ఉత్తమ సేవలు అందిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో ప్రతిభ పురస్కారాలు లభించాయి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పోలవరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎటపాక మండలానికి చెందిన సోయాం నవీన్, సుగుణ, లలిత గాయత్రిలు జిల్లా స్థాయి ప్రతిభ పురస్కారాలను అందుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామమూర్తితో కలిసి కలెక్టర్ కె.దినేష్ కుమార్ వారికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యా రంగంలో అందించిన సేవలను గుర్తించి జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపిక చేయడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సోయాం నవీన్ మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి జిల్లా స్థాయి పురస్కారం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో విద్యార్థుల కోసం మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# గ్రామ సభతోనే సమస్యలు పరిష్కారం ....




**కౌతాళం, సెప్టెంబర్ 05 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలోని శనివారం రోజున సచివాలయం నందు గ్రామ సభ నిర్వహించారు.ఈ సభను ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ గ్రామ సభతోనే సమస్యలు పరిష్కారమని అన్నారు.గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే ఈ సభ ద్వారా తెలియజేయండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి పవన్ కుమార్,టిడిపి కౌతాళం టౌన్ అధ్యక్షులు డాక్టర్ రాజానందు,మాజీ సర్పంచ్ పాల్ దినకర్ మరియు పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేస్తాం

**నందిగామలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎంఎస్ సమావేశం**



**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు ముమ్మడివరపు చిన్నసుబ్బారావు మాదిగ సారథ్యంలో, ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్‌చార్జి మొర్త బుజ్జిబాబు మాదిగ ఆధ్వర్యంలో ఎటపాక మండలం నందిగామ గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎంఎస్ కమిటీల నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై నాయకులు చర్చించారు. సంఘాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు, మాదిగల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా కొత్తపల్లి నితిన్ మాదిగ, ఎటపాక మండల అధ్యక్షుడిగా కంచర్ల వీరేంద్ర మాదిగ, మండల అధికార ప్రతినిధిగా మోదుగు ముత్యాలు మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా అనపర్తి రామకృష్ణ మాదిగ, అధికార ప్రతినిధిగా మోదుగు శివరామకృష్ణ మాదిగలను నియమించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అల్లూరి జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్నబాబు, ఉమ్మడి అల్లూరి జిల్లా ఎంఎస్పీ మాజీ అధ్యక్షుడు బింగి విష్ణుమూర్తి, ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు తుంగ కుమార్, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు ములకలపల్లి సరోజినీ, నందిగామ ఎమ్మార్పీఎస్ కమిటీ సభ్యులు, మండల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గజ్జహాళ్లిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**హోళగుంద,సెప్టెంబర్ 05, ప్రజా జ్యోతి న్యూస్ -** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో హరే శ్రీనివాస భజన మండలి సభ్యులు భజనలు నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయంత్రం శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ఊరేగింపుగా గ్రామ పురవీధుల గుండా తీసుకువెళ్లారు. ఈ సందర్భం గా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని భక్తులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.హరే శ్రీనివాస భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ, భక్తి పారవశ్యంతో చిందులు వేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద శ్రీకృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులతో ఉట్టి కొట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ఉత్సాహం, వారి విన్యాసాలు అక్కడికి చేరుకున్న వారందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులు, భజన మండలి సభ్యులు తిరిగి శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి చేరుకోవడంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఊరేగింపు ముగిసింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న యం.మునెయ్య




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 05 (ప్రజా జ్యోతి)** బద్వేల్ మండలం కొత్తచెరువు హెచ్ డబ్ల్యు పాఠశాల నందు పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులైనటువంటి మేకల మునెయ్య సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగం లో బద్వేల్ మండలం నుండి కడప జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు గ్రహీత గా సెలెక్ట్ కావడం జరిగింది. వీరు సర్వీసులో 04/11/2010 తేదీన మొట్టమొదటిగా ఒంటిమిట్ట మండలం దవంతరం పల్లి గ్రామం లో సర్వీసులో చేరినప్పటి నుండే విద్యార్థులకు నవోదయ, మోడల్ స్కూల్ కి పరీక్షలు రాపించడం, ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తూ 10/08/2017 వరకు అక్కడ పని చేసి అక్కడ నుండి గోపవరం మండలం కాలువపల్లి హెచ్ డబ్ల్యూ గ్రామం లో 11/08/2017 నుండి 14/06/2025 వరకు పని చేసి ఆ గ్రామంలోనూ తను చేరినప్పుడు 12 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను 32 మంది విద్యార్థులుగా చేసి, ఆ గ్రామ ప్రజల చేత మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకొని ఇంకా మండలంలోనూ మంచి పేరు తెచ్చుకొవడం జరిగింది. తరువాత అక్కడినుండి ప్రస్తుతం బద్వేల్ మండలం కొత్తచెరువు హెచ్ డబ్ల్యు పాఠశాలకి 15/06/2015 తేదీన చేరి అప్పటి నుండి కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే తన పాఠశాలను 21 మంది విద్యార్థుల నుండి ప్రస్తుతం దాదాపుగా 40 మంది విద్యార్థులను చేసి ఆ గ్రామం లోనూ పేరు పొంది మరియు బద్వేల్ మండలంలోని ఉపాధ్యాయులకు సేవలు అందిస్తూ అందరి ఉపాధ్యాయులకు పరిచయస్తులుగా మారి నేడు బద్వేల్ మండలం తరపున సెకండరీ గ్రేడ్ టీచర్ క్యాడర్ లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సెలెక్ట్ అయి కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా మేడం గారి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును యం .మునెయ్య స్వీకరించినందుకు అటు బద్వేల్ మండలం, గోపవరం మండల ఉపాధ్యాయులు అతనికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, ఒక మంచి ఉపాధ్యాయుడికి ఈ అవార్డు రావడం గర్వకారణంగా ఉందని తెలియజేశారు.

# విద్యారంగంలో సర్వేపల్లి రాధాకృష్ణ కృషి ఎనలేనిది





## మదర్ తెరిసా పాఠశాలలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

**హొళగుంద, సెప్టెంబర్ 5, ప్రజా జ్యోతి న్యూస్ –** భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మదర్ తెరిసా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కలుస్పాండెంట్ వీరేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలనే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతను బోధించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు, విద్యారంగ అభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా గురువుల గొప్పతనాన్ని స్మరించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను ప్రశంసించారు. విద్యార్థులు గురువులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గురువు చూపిన మార్గమే విద్యార్థి జీవితానికి వెలుగుదారి" అని పేర్కొంటూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# గంజాయి మాయలో పడితే భవిష్యత్ అంధకారమే!

**మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు.. హెల్మెట్ తప్పనిసరి**

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి ఎటపాక సీఐ వి.కృష్ణ, ఎస్ఐ జి.అప్పలరాజు**



**ఎటపాక, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరం గా ఉండాలని ఎటపాక సీఐ వి.కృష్ణ, ఎస్ఐ జి.అప్పలరాజు సూచించారు. శని వారం పోలవరం జిల్లా చింతూరు సబ్‌డివి జన్ పరిధిలోని పిచ్చుకలపాడు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వి.కృష్ణ, ఎస్ఐ జి.అప్పలరాజు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల బారినపడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్ మాయలో పడి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. మైనర్ వయస్సు గల విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. మహిళల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గుర్తుతెలి యని వ్యక్తుల నుంచి వచ్చే అనుమా నాస్పద ఫోన్‌కాల్స్, సందేశాలు, లింక్‌లకు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. పిల్లలు కష్టపడి చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు, గౌరవం తీసుకురావాలని పోలీసులు ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు పోలీసుల సూచనలను పాటిస్తూ సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భారతదేశ భవిష్యత్ నిర్మాతలు ఉపాధ్యాయులే

## గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**బేతంచెర్ల : సెప్టెంబర్ 5(ప్రజా జ్యోతి)**గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠశాల ప్రిన్సిపాల్ టి. మరియదాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ టి. మరియదాస్ మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. ప్రతి ఉపాధ్యాయుడు రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకొని సమాజ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా, దేశ ప్రధానమంత్రి అయినా, ప్రతి వ్యక్తి జీవితానికి పునాది పాఠశాలలోని నాలుగు గోడల మధ్య ఉపాధ్యాయుల చేతుల్లోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు.దేశ భవిష్యత్తు కోసం మంచి పునాదులు వేసి, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు నవసమాజ నిర్మాణ ప్రదాతగా, విద్యార్థుల అభివృద్ధికి సంస్కర్తగా, ప్రగతిశీల ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే సమాజం నవజీవనాన్ని సంతరించుకుంటుందని ఉపాధ్యాయులు, అవధాని గంగుల నాగరాజు తెలిపారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు సగౌరవంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. పూలబాటలో తమను నడిపిస్తూ, నవ్వుల నావలో తమ జీవితాలను ఆనందమయం చేయాలని కోరుతూ విద్యార్థులు కవితాగానాలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గురువులపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## గర్భిణులు బాలింతలు చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు అందించి, వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టళ్లలో నమోదు చేయాలని ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. మల్లేష్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం బద్వేల్ మండలం తొట్టిగారిపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం, కోటవీధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయ పరిధిలోని గర్భిణుల నమోదు, బాలింతలు, గర్భిణుల సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతి చిన్నారికి, గర్భిణికి నిర్ణీత సమయంలో టీకాలు అందించాలని తెలిపారు.ప్రతి బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించి, వివరాలను రిప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ (=జు) పోర్టల్‌తో పాటు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మాతృ, శిశు మరణాలను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు, ఆడ-మగ శిశు వివక్షకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే సంబంధిత ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ. మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంకయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ శ్రీరామయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో ఘనంగా శ్రీ గుంటెప్ప స్వామి జాతర



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):**ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీలో నిర్వహించిన శ్రీ గుంటెప్ప స్వామి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ గుంటెప్ప రంగస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం జాతర మహోత్సవానికి హాజరైన భక్తులు, ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ గుంటెప్ప స్వామివారి ఆశీస్సులతో ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాల తో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు!

**ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష**

**-- శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలి.**



**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి గారు గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, అగ్నిమాపక, రక్షణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు.

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు:**

నిమజ్జనం జరిగే కాలువ పరిసరాల్లో తాగునీరు, పారిశుధ్యం, పరిశుభ్రత, విద్యుత్, లైటింగ్ సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పాటు శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్, అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా పూర్తయ్యేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, మూడు మండలాల సీఐలు, ఎస్సైలు, ట్రాఫిక్ ఎస్సై, ఫైర్ అండ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో వైఎస్సార్సీపీకి పూర్వ వైభవం తీసుకురావాలి

**బాపట్ల సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్సీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ పట్ల నమ్మకాన్ని మరింత పెంచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. బాపట్లలో శనివారం నిర్వహించిన వైఎస్సార్సీపీ జిల్లా స్థాయి సమావేశంలో పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనమండలి ఉపసభాపతి తూమాటి మాధవరావు మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు భవిష్యత్‌లో తగిన ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. స్థానిక ఎన్నికలు కార్యకర్తల పనితీరుకు కీలకమైన వేదికగా నిలవనున్నందున ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రజలతో మమేకం కావాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర విషయంలో రైతుల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. పొగాకు రైతులు తమ సమస్యలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన భరోసాతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో వారి ఇబ్బందులు పెరిగాయని విమర్శించారు. బాపట్ల జిల్లాకు చెందిన మంత్రులు ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదని తూమాటి మాధవరావు ఆరోపించారు. 22ఏ భూముల సమస్యతో పాటు విద్యుత్ సరఫరా అంశంలోనూ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మంత్రులు ప్రజా సమస్యల కంటే తమ వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారంటూ విమర్శించారు. డీఎస్సీ నియామకాల విషయంలో చోటుచేసుకున్న అక్రమాలను ఆధారాలతో ఒక్కొక్కటిగా ప్రజల ముందుకు తీసుకొస్తామని తెలిపారు.

**కార్యకర్తలే పార్టీకి బలం**

వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది ఉందని అన్నారు. గతంలో పార్టీ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వ పాలనతో వాటిని బేరీజు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

**ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగాలి**

మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని అన్నారు. ప్రజల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీలపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో చోటుచేసుకున్న మార్పులను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**ఒత్తిళ్లకు భయపడొద్దు**



మాజీ ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే విషయంలో పార్టీ శ్రేణులు వెనుకడుగు వేయకూడదన్నారు. అధికార పక్షం నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లకు భయపడకుండా ప్రజా సమస్యలపై గళం విప్పాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలని కోరారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు కరణం వెంకటేష్‌బాబు, గాదె మధుసూదనరెడ్డి, వరికూటి అశోక్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిది

**కర్నూలు:సెప్టెంబర్ 5(ప్రజా జ్యోతి)** మండలంలోని విరుపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారులు ఈరన్న, శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 1990లో క్రిష్ణగిరి మండలం కంబాలపాడులో ఉపాధ్యాయ వృత్తిలో చేరి సేవలందించి పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ, జనార్ధన్ గౌడ్, శివశంకరయ్య, నాగేశ్వరరెడ్డి, స్కూల్ అసిస్టెంట్లు డివిఎస్ ప్రసాద్, రామలింగేశ్వరరెడ్డి, క్రిష్ణమూర్తి, పి ఎస్. హెచ్ ఎం శ్రీనివాసులు, శ్రీరాములు, సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు పద్మనాభరెడ్డిలను విద్యార్థులు పూలతో వేదికపైకి ఆహ్వానించి మెమెంటోలు, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే మండల విద్యాశాఖాధికారులు ఈరన్న, శ్రీనివాస్ రెడ్డిలను శాలువా, పూలమాల, మెమెంటోతో సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డితో పాటు ఉపాధ్యాయులు రామాంజనేయ, గాదిలింగప్ప, హిమశైలజ, ధనలక్ష్మి, నాగరాజు, హరిత, వినయ్‌కుమార్‌లను పూర్వ విద్యార్థులు మెమెంటోలు, ఫోటోలు, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. గురువులకే గురువుగా నిలిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభాకర్ గౌడ్, పాఠశాల కమిటీ చైర్మన్ రామాంజనేయులు, గ్రామ పెద్దలు పురుషోత్తం, గాదిలింగప్పతో పాటు ఆలూరు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, విరుపాపురం, బోలగొట్ట, సులువాయి తదితర ప్రాంతాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# తక్కువ నీటితో  కూరగాయల సాగు
# అధిక దిగుబడులు సాధించవచ్చు

**మల్చింగ్, డ్రిప్, స్ప్రింక్లర్ వినియోగంపై రైతులకు అవగాహన**

**తాండూరు** : రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించాలని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు. తాండూరు మండలం కొత్తపల్లి రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ ద్వారా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, పంటల యాజమాన్య పద్ధతులు, నీటి వినియోగం, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఉద్యాన శాఖ అధికారిణి అర్చన మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించడం ద్వారా నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో పంటలను సమర్థవంతంగా సాగు చేయవచ్చని తెలిపారు. మల్చింగ్ పద్ధతి ద్వారా నేలలో తేమ ఎక్కువ కాలం నిలిచి ఉండటంతో పాటు కలుపు మొక్కల నియంత్రణకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా పంటకు అవసరమైన నీటిని సమర్థవంతంగా అందించడంతో నీటి పొదుపుతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా కూరగాయల సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా వివిధ పథకాల కింద సబ్సిడీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అర్చన వివరించారు. అర్హత కలిగిన రైతులు ఈ సబ్సిడీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారిణి కె. సుష్మా రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంటకు అవసరమైన పోషకాలను గుర్తించి, భూసారానికి అనుగుణంగా ఎరువులను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించాలని సూచించారు. అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సాగు చేపట్టాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్, ఎంబడి శ్వేత రాణి, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్, మ్యాట్రిక్స్ ఎఫ్ఈ కిరణ్ పాల్గొన్నారు.



## శంఖవరం విద్యాశాఖ కార్యాలయంలో గురుపూజోత్సవ వేడుకలు..

**ఉత్తమ ఉపాధ్యలకు సన్మానం..**



**శంఖవరం, సెప్టెంబర్ 5: (ప్రజా జ్యోతి న్యూస్)** సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని శంఖవరం మండల విద్యాశాఖ కార్యాలయంలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ఎస్.వి. రమణ, టి. గోవింద్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త, భారతరత్న గ్రహీత అని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఆయన, తన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని కోరడం గురువుల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, రాధాకృష్ణ ఆశయాలను ప్రతి ఉపాధ్యాయుడు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు శంఖవరం ఏబీఎన్ పాఠశాలకు చెందిన కుర్ర బాల భాస్కరరావు, అన్నవరం దేవస్థానం పాఠశాలకు చెందిన ఎం. ప్రసాద్, కత్తిపూడి ఈబీసీ పాఠశాలకు చెందిన గాము నూకరాజు, అలాగే మండల స్థాయి అవార్డు గ్రహీతలు ఎస్. దేవుళ్ళు, టి. రాజబాబు, ఎంఆర్సీ ఎంఐఎస్ కే. నాగరాజులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కే. వెంకటేశ్వరరావు, తోట సీతారామయ్య, పి.ఎస్. చంటిబాబు, జి. స్వరాజ్యలక్ష్మి తో పాటు మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్ఎస్ రంగాపురంలో పోలీసుల పల్లెనిద్ర

**ప్రజల సమస్యలపై ఆరా.. నేరాల నియంత్రణపై అవగాహన**



**బేతంచెర్ల:సెప్టెంబర్ 5(ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డోన్ డీఎస్పీ సూచనలతో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ రమేష్‌బాబు గ్రామంలో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి, శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం నేరాల నియంత్రణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటూ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు పల్లెనిద్ర వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.

## పెళ్లైన వారం రోజులకే యువకుడి దుర్మరణం

**- నర్సాపురం జగనన్న కాలనీ వద్ద రోడ్డు ప్రమాదం**

**- అక్కడికక్కడే మృతి చెందిన యువకుడు**



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** పెళ్లైన వారం రోజులకే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద ఘటన పొందూరు మండలం నర్సాపురం గ్రామంలోని జగనన్న కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సంతకవిటి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పోతూరి నారాయణరావు (21) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే రాపాక గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన నారాయణరావు అనంతరం శ్రీకాకుళం పనిమీద వెళ్లి తిరిగి వస్తుండగా నర్సాపురం వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు నారాయణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వివాహం జరిగి కేవలం ఏడు రోజులు మాత్రమే కావడంతో ఈ ఘటన కుటుంబ సభ్యులు, బంధువులను తీవ్ర విషాదంలో ముంచింది. ప్రమాద సమయంలో బైక్‌పై వెనుక కూర్చున్న అంబటి జగదీశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,